TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక: 220 శుక్రవారం, జూన్ 26, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు

అత్యుత్తమమైన సేవలు,

ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.

జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

మా ప్రత్యేకతలు

- అత్యవసర & క్రిటికల్ కేర్
- ప్రమాద సేవలు
- ప్రస్తూతి & గైనకాలజీ
- ఆర్థోపెడిక్స్
- జాయింట్ రీప్లేస్‌మెంట్స్
- జనరల్ మెడిసిన్
- జనరల్ సర్జరీ
- మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
- పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
- న్యూరాలజీ • న్యూరోసర్జరీ
- ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
- యూరాలజీ • డెర్మటాలజీ
- సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ

అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్

+91 85230 89599 +91 86889 09384

www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## నాతో సహా ఉద్యోగులంతా మధ్య తరగతి వారే: సీఎం రేవంత్



హైదరాబాద్: తనతో సహా ఉద్యోగులంతా మధ్య తరగతి వర్గానికి చెందిన వారేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఉద్యోగులంతా సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ ఆలోచనని, అందుకే కార్మికులకు కోటి రూపాయల బీమా అందిస్తున్నామన్నారు. ఈరోజు(గురువారం) రవీంద్రభారతిలో ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ పథకాన్ని ప్రారంభించారు సీఎం రేవంత్.

దీనిలో భాగంగా రేవంత్ మాట్లాడుతూ.. ఉద్యోగులు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతోనే బీమా రక్షణ పథకాన్ని అమల్లోకి తెస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు బీమా కల్పించడం సంతోషంగా ఉందన్నారు. ఇప్పటివరకూ సింగరేణిలో 45 మంది కార్మికులకు ప్రమాద బీమా అందించామన్నారు సీఎం రేవంత్. ఉద్యోగులు, కార్మికులకు రక్షణ కల్పించే బాధ్యత తమ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు.

తనను రేవంతన్న అని పిలిస్తే సంతోషంగా ఉంటుందన్నారు. తాను ఒకప్పుడు జెడ్పీటీసీనని, ఆ తర్వాత ఎంపీనని, ఇప్పుడు సీఎంనని రేవంత్ అన్నారు. పదవులు ఇలా మారుతూ ఉంటాయని, అందుచేత రేవంతన్న అనేది శాశ్వతంగా ఉంటుందన్నారు.

# తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్లు ప్రారంభోత్సవం: హాజరైన ముగ్గురు సీఎంలు

బళ్లారి: కర్ణాటకలోని హోస్పేటలో తుంగభద్ర ప్రాజెక్టు కొత్త గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కేంద్రమంత్రి సీఆర్ పాటిల్, కర్ణాటక సీఎం డీకే శివకుమార్, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొని నూతన గేట్లను ప్రారంభించారు. 2024 ఆగస్టులో వచ్చిన వరద ప్రవాహానికి 19వ గేటు కొట్టుకుపోయింది. దీంతో ఆ ప్రాజెక్టును పరిశీలించిన నిపుణుల కమిటీ సూచనతో రూ.51 కోట్లతో 33 కొత్త గేట్లను అమర్చారు. మూడు రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.



**జల వివాదాలను పరిష్కరించుకుందాం: సీఎం రేవంత్‌రెడ్డి**

తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు."తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నా. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగుతున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాను. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలను తీరుస్తుంది" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**నదుల అనుసంధానంతో గుజరాత్‌లో సమృద్ధిగా జలాలు: సీఆర్ పాటిల్**

ప్రస్తుత డ్యామ్‌లు ఆధునిక సాంకేతికతతో రూపొందుతున్నాయని కేంద్రమంత్రి సీఆర్ పాటిల్ అన్నారు. 73 ఏళ్ల క్రితం మట్టితో నిర్మించిన తుంగభద్ర ప్రాజెక్టు ఇప్పటికీ బాగుందని చెప్పారు. "ఈ ప్రాజెక్టులో ఒక్క గేటు కొట్టుకుపోవడం వల్ల అన్ని గేట్లూ మార్చాల్సిన పరిస్థితి వచ్చింది. నర్మద, సరోవర్ జలాలు మిళితం చేసి నదుల అనుసంధానం చేపట్టాం. ఈ ప్రక్రియతో గుజరాత్‌లో నదీజలాలు సమృద్ధిగా ఉన్నాయి. రూ.లక్ష కోట్లతో రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో 3 నదులు అనుసంధానం చేపట్టాం" అని సీఆర్ పాటిల్ అన్నారు.

## అంగన్ వాడీలను కాంగ్రెస్ మోసం చేసింది: సత్యవతి రాథోడ్




హైదరాబాద్: అంగన్ వాడీలకు తగిన గౌరవాన్ని, గుర్తింపును, వేతనాలను పెంచిన ఘనత మాజీ సిఎం కెసిఆర్ అని బిఆర్ఎస్ మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ కొనియాడారు. అంగన్ వాడీలకు పిఆర్సి కూడా ఇచ్చామని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అంగన్ వాడీలను కాంగ్రెస్ మోసం చేసిందని, సిఎం రేవంత్ పాలనలో అంగన్ వాడీలను పట్టించుకునే నాథుడే లేడని సత్యవతి రాథోడ్ విమర్శించారు. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ ఊసే ఎత్తడం లేదని, అవినీతికి ఆస్కారం ఉండేలా జివో తీసుకొచ్చారని మండిపడ్డారు. రేవంత్ సర్కారు అవినీతికి తెరలేపిందని, కాంగ్రెస్ నేతల జేబులు నింపేలా జివో ఉందని ధ్వజమెత్తారు. జివోను వెంటనే వెనక్కి తీసుకోవాలని, అంగన్ వాడీలకు ప్రతినెలా ఠంచనుగా జీతాలు ఇవ్వాలని సత్యవతి రాథోడ్ కోరారు.

# ప్రధాని మోదీతో అమెజాన్ సీఈవో భేటీ..

న్యూ ఢిల్లీ, ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ భారత్‌లో తన వ్యాపార కార్యకలాపాలను భారీగా విస్తరించేందుకు సిద్ధమైంది. ప్రధాని నరేంద్రమోదీ తోకంపెనీసీఈఓఆండీ జెస్సీ (ఒనిటఎ ఏవబబఎ) సమావేశమైన అనంతరం ఈ కీలక ప్రకటన వెలువడింది. 2026 నుంచి 2030 మధ్య కాలంలో దేశంలో ఏకంగా 48 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4.53 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. ఈ పెట్టుబడులతో భారత మార్కెట్‌పై తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతను కంపెనీ మరోసారి స్పష్టంచేసింది. భారత్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను విస్తరించడానికి 2030 నాటికి అదనంగా 13 బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెట్టనున్నట్లు ఆండీ జెస్సీ తెలిపారు. దాంతో కేవలం ఏఐ, క్లౌడ్ రంగంలోనే అమెజాన్ మొత్తం పెట్టుబడి 21 బిలియన్ డాలర్లను దాటనుంది. ఈ పెట్టుబడుల ద్వారా ముంబై, హైదరాబాద్‌లలోని అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) డేటా సెంటర్ల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనున్నారు. ఇది స్టార్టప్‌లు, వ్యాపార సంస్థలు, ప్రభుత్వ ఏజెన్సీలకు కస్టమ్ ఏఐ చిప్స్, సురక్షిత క్లౌడ్ టెక్నాలజీలు, డెవలపర్ టూల్స్‌ను అందుబాటులోకి తెస్తుంది.తద్వారా ఆవిష్కరణలను వేగవంతం చేయవచ్చని

**రూ.లక్షల కోట్ల పెట్టుబడులు**



కంపెనీ పేర్కొన్నది. ఈ సమావేశం అనంతరం ఆండీ జెస్సీ మాట్లాడుతూ.. దశాబ్దం క్రితం భారత్‌లోకి అడుగుపెట్టామని, అప్పటి నుంచి ఈ-కామర్స్, ఏఐ, క్లౌడ్ వ్యాపారాల్లో అద్భుతమైన వృద్ధిని చూస్తున్నామని అన్నారు. ప్రధాని మోదీ దార్శనికత అయిన 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యాల సాధనకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. భారత్ వృద్ధి ప్రస్థానంలో దీర్ఘకాలిక భాగస్వామిగా కొనసాగుతామని స్పష్టంచేశారు. ఈ కొత్త పెట్టుబడులతో కలిపి 2010 నుంచి 2030 వరకు భారత్‌లో అమెజాన్ పెట్టిన మొత్తం పెట్టుబడుల విలువ 88 బిలియన్ డాలర్లకు చేరుకుంటుంది.గత కొన్నేళ్లుగా భారత్‌లో 12 మిలియన్ల చిన్న వ్యాపారాలను డిజిటలైజ్ చేశామని, 20 బిలియన్ డాలర్ల విలువైన ఈ-కామర్స్ ఎగుమతులను సాధ్యం చేశామని, ప్రత్యక్షంగా, పరోక్షంగా 2.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇచ్చామని అమెజాన్ కంపెనీ వివరించింది. అలాగే 10 మిలియన్ల భారతీయులకు క్లౌడ్ స్కిల్స్‌పై శిక్షణ ఇచ్చినట్లు తెలిపింది. భవిష్యత్తులోనూ భారత ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ఏఐ ఆధారిత డిజిటలైజేషన్, ఎగుమతుల వృద్ధి, ఉద్యోగాల కల్పనపై దృష్టి సారిస్తామని అమెజాన్ పేర్కొన్నది.రానున్న కాలంలో 3.8 మిలియన్ల ఉద్యోగాలకు మద్దతు ఇవ్వడం, 80 బిలియన్ డాలర్ల సంచిత ఎగుమతులు సాధించడం, 15 మిలియన్ల చిన్న వ్యాపారాలకు ఏఐ ప్రయోజనాలు అందించడం, 4 మిలియన్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏఐ విద్యను అందించడం వంటి లక్ష్యాలను నిర్దేశించుకున్నట్లు అమెజాన్ వెల్లడించింది.

## ప్ర రా బి నేటిమాట..

జన్మనిచ్చిన తల్లిని ప్రాణం ఉన్నంతవరకు ప్రాణం లా చూసుకోవడం మన బాధ్యత. తల ఎత్తి నిలబడేలా నేర్పించిన తండ్రిని తల దించుకోకుండా చూసుకోవడం కూడా మన బాధ్యతే

- ప్రమీల రాణి బి

# 10 అంతస్తుల హోటల్.. శిథిలాల దిబ్బగా: 164కు పెరిగిన భూకంప మృతులు

వెనెజువెలాలో వరుస భూకంపాలు సృష్టించిన విలయం అంతా ఇంతా కాదు. ఈ విపత్తు ధాటికి ఆ దేశం అతలాకుతలమైంది. ప్రాణనష్టం కూడా భారీగానే ఉంది. ముఖ్యంగా తీర నగరమైన 'లా గువైరా' అయితే ఇప్పుడు మరుభూమిని తలపిస్తోంది. అక్కడ ఎటు చూసినా ధ్వంసమైన భవనాల వరుసలే కన్పిస్తున్నాయి. ఇక, ఈ నగరంలోని ప్రముఖ హోటల్ ఒకటి శిథిలాల దిబ్బలా మారింది.

లా గువైరాలోని మకుటో ప్రాంతంలో ఉంటే 'హోటల్ ఎడ్వర్డ్' పర్యటకులకు చాలా ఫేమస్. ఎయిర్‌పోర్టుకు సమీపంలో ఉండే ఈ 10 అంతస్తుల భవనం.. బీచ్‌వ్యూతో ఆహ్లాదకరంగా ఉండేది. ఇక్కడ పార్టీలు, సమావేశాలు ఎక్కువగా జరుగుతుంటాయి. తాజాగా సంభవించిన భూకంపం ధాటికి ఈ భవనం పేకమేడలా కూలిపోయింది. కేవలం హోటల్ బేస్‌మెంట్ మాత్రమే మిగిలి గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అయితే, భూకంపం సమయంలో ఈ హోటల్‌లో ఎంతమంది ఉన్నారు.. వారి పరిస్థితి ఏంటన్నది తెలియరాలేదు. వెనెజువెలా బేస్‌బాస్ స్టార్ ఆటగాళ్లకు చెందిన కుటుంబసభ్యులు ఈ హోటల్ శిథిలాల కింద చిక్కుకున్నట్లు సమాచారం.






**డిజాస్టర్ జోన్‌గా..**

కేవలం క్షణాల వ్యవధిలో సంభవించిన భారీ భూకంపాల ప్రభావంతో వెనెజువెలా రాజధాని కరాకస్‌తో పాటు పలు నగరాలు చిన్నాభిన్నమయ్యాయి. ఇందులో అత్యధికంగా ప్రభావితమైంది 'లా గువైరా'నే అని తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ వెల్లడించారు. దీన్ని 'డిజాస్టర్ జోన్'గా ప్రకటించారు. ఇక్కడ పరిస్థితి అత్యంత విషాదకరం అని ఆమె విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఇప్పటివరకు 30 సార్లు భూప్రకంపనలు సంభవించాయి.

**164 మంది మృతి..**

మరోవైపు, ఈ విపత్తు కారణంగా మరణించిన వారి సంఖ్య 164కు పెరిగింది. 971 మంది గాయపడినట్లు రోడ్రిగ్జ్ వెల్లడించారు. ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, శిథిలాల కింద చిక్కుకున్నవారిని గుర్తించి ఆసుపత్రులకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక, విపత్తు వేళ వెనెజువెలాకు సాయం అందించేందుకు పలు దేశాలు ముందుకొస్తున్నాయి. జర్మనీ సైనిక రవాణా విమానాలను పంపిస్తామని చెప్పింది. ఎమర్జెన్సీ సాయం చేస్తామని స్పెయిన్ తెలిపింది.

# సంపాదకీయం

**శుక్రవారం, జూన్ 26, 2026**

## చమురు ధరలు 50 డాలర్ల దిగువకు..?

సుదీర్ఘ కాలంలో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరిగాయి. ఇటీవల అమెరికా- ఇరాన్ ఎట్టకేలకు తాత్కాలిక అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేయగా కాస్త ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టాయి. దీంతో అప్పటినుంచి ముడి చమురు ధరలు భారీగా దిగొస్తున్నాయి. గరిష్ఠ స్థాయిల నుంచి పెద్ద మొత్తంలో పతనమై ప్రస్తుతం 4 నెలల కనిష్ఠ స్థాయిలకు చేరడం ఊరట కలిగిస్తోంది. జూన్ 24న బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 75.45 డాలర్లకు పడిపోయింది. ఇవాళ ఒక్కరోజే 2 శాతానికిపైగా తగ్గింది. భవిష్యత్తులో మరింత తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా ఇరాన్ యుద్ధం ఫిబ్రవరి 28న ప్రారంభం కాగా అప్పుడు 70 డాలర్ల స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధర భారీగా పెరుగుతూ వెళ్లింది. ఈ క్రమంలోనే ఒక దశలో ఏకంగా 126 డాలర్ల స్థాయికి ఎగబాకింది. దాదాపు 70 శాతానికిపైగా పెరిగిందని చెప్పొచ్చు. ప్రధానంగా చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధి మూతబడటంతో ఈ క్రమంలోనే పలు దేశాల్లో చమురు సంక్షోభం నెలకొంది. పలు దేశాల్లో ఇంధన ధరలు విపరీతంగా పెరిగాయి. తర్వాత మొదట కాల్పుల విరమణ, తర్వాత ఒప్పందం దిశగా అడుగులు పడటంతో చమురు ధర తగ్గుతూ వచ్చింది. ఇప్పుడు డీల్ కుదిరిన తర్వాత మరింత తగ్గుతూ వస్తోంది.అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ప్రతి బారెల్‌కు 78 డాలర్లకు పడిపోయి.. గత మూడు నెలల కనిష్ట స్థాయిని తాకినా భారత ప్రభుత్వం ధరలు తగ్గించకపోవడంపై సామాజిక మాధ్యమ వేదిక 'రెడ్డిట్ లోని ఇండియన్ స్టాక్ మార్కెట్ ఫోరమ్‌లో ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా భారత్‌లో ఇంధన ధరలను తగ్గించకపోవడంపై నెటిజన్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో చమురు ధరలు తగ్గకపోతే ద్రవ్యోల్బణం పెరిగి.. ఆర్థిక వృద్ధి మందగిస్తుందని... ప్రభుత్వం సామాన్యుల ఇబ్బందులను పట్టించుకోవడం లేదని కొందరు నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఈ డిబేట్‌లో వినియోగదారులపై పడుతున్న పన్నుల భారం ప్రధానంగా చర్చకు వచ్చింది. ముడిచమురు ధరలు పెరిగినప్పుడు లీటరుకు ఎనిమిది రూపాయల వరకు పెంచిన ప్రభుత్వం... ధరలు తగ్గినప్పుడు మాత్రం ఆ ప్రయోజనాన్ని ప్రజలకు బదిలీ చేయడం లేదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివిధ సంక్షేమ పథకాల కోసం మధ్యతరగతి పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వం ఏటికేడు పిండేస్తోందని.. 2014 నాటి యూపీఏ ప్రభుత్వ కాలం నాటి వ్యతిరేక పరిస్థితులే ప్రస్తుత ప్రభుత్వంపై కూడా కనిపిస్తున్నాయని కొందరు కామెంట్ చేశారు.మరోవైపు.. అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ ధరలకు, దేశాలు కొనుగోలు చేసే భౌతిక మార్కెట్ ధరలకు మధ్య వ్యత్యాసం ఉంటుందని కొందరు ఆర్థిక కోణాన్ని విశ్లేషించారు. 2026 మార్చిలో ముడిచమురు ధరలు ఒక్కసారిగా 100 నుండి 110 డాలర్లకు పెరిగినప్పుడు... ఆ భారాన్ని ప్రభుత్వం వినియోగదారులపై పడకుండా కొంతకాలం నియంత్రించిందని ఒక నెటిజన్ గుర్తుచేశారు. ప్రభుత్వం ఇంధన ధరల స్థిరత్వాన్ని కాపాడటం వల్లే భారీ యుద్ధ సమయాల్లో కూడా దేశంలో ధరలు అదుపులో ఉన్నాయని, తక్షణమే ప్రయోజనాలు ఆశించడం సరికాదనే వాదన కూడా వినిపించింది. ఇంధన ధరల నియంత్రణకు గానూ ప్రభుత్వం చేపడుతున్న ఇథనాల్ బ్లెండింగ్ విధానంపైనా రెడ్డిట్ వినియోగదారులు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చమురు ధరలు ఎంత తగ్గినా.. పెట్రోల్, డీజిల్ పరిమాణాన్ని తగ్గించి దాని స్థానంలో ఇథనాల్‌ను ఎక్కువగా కలుపుతున్నారని నెటిజన్లు ఆరోపించారు. దీనివల్ల సామాన్యుడికి ధరల భారం తగ్గడం లేదని... కేవలం ఇథనాల్ తయారుచేసే బడా వ్యాపారవేత్తలకు, పాలకుల కుటుంబాలకే లాభం చేకూరుతోందంటూ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఉద్దేశించి కొందరు ఘాటుగా విమర్శలు గుప్పించారు.. ఈ ఇంధన సంక్షోభానికి శాశ్వత పరిష్కారంగా ఈవీ అడాప్టేషన్ వైపు మారడమే ఏకైక మార్గమని కొందరు అభిప్రాయపడగా... అది అంత సులువు కాదని మరికొందరు గణాంకాలతో వివరించారు. భారతదేశంలో ప్రస్తుతం ఉన్న 5 కోట్ల కార్లు, 26 కోట్ల ద్విచక్ర వాహనాలను ఈవీలుగా మార్చాలంటే దేశ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యాన్ని మరో 600 నుండి 700 శాతం పెంచాల్సి ఉంటుందని... లేదంటే గ్రిడ్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏదేమైనా.. అంతర్జాతీయంగా తగ్గిన చమురు ధరల ప్రయోజనం దేశీయంగా సామాన్యుడికి అందడం లేదనేది ఈ మొత్తం చర్చ సారాంశం.ముడి చమురు ధర సమీప భవిష్యత్తులో మరింత తగ్గుతుందని భావిస్తుండగా, ఇది భారత్‌పై దిగుమతుల భారం తగ్గేలా చేస్తుంది. ధరలు నిరంతరాయంగా తగ్గుతుండటంతో, క్రూడాయిల్ బ్యారెల్‌కు 50 డాలర్ల కంటే కిందికి పడిపోతుందా అనే చర్చ తెరపైకి వచ్చింది. అయితే, సమీప భవిష్యత్తులో ధరలు అంతగా పడిపోయే అవకాశం లేదని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతానికి మార్కెట్ కేవలం భౌగోళిక రాజకీయాల నుంచి డిమాండ్-సప్లై సమీకరణాల వైపు మళ్లుతోంది. బ్రెంట్ క్రూడ్ రాబోయే రోజుల్లో 65 నుంచి 75 డాలర్ల పరిధిలో కదలాడవచ్చు. ధరలు 50 డాలర్ల దిగువకు వెళ్లాలంటే చైనా లాంటి పెద్ద దేశాల్లో డిమాండ్ దారుణంగా పడిపోవాలి, లేదా అంతర్జాతీయంగా చమురు నిల్వలు విపరీతంగా పేరుకుపోవాలి. ప్రస్తుతానికైతే అలాంటి పరిస్థితులు కనిపించడం లేదు.ఈ క్రమంలోనే రూపాయి విలువ పుంజుకోవడం సహా ద్రవ్యోల్బణం భయాలు కూడా తగ్గుముఖం పడతాయి. యుద్ధం ప్రారంభం నాటి నుంచి గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న చమురు నౌకలు/ట్యాంకర్లు ఇప్పుడు హోర్ముజ్ జలసంధిగుండా రాకపోకలు ప్రారంభించాయి. ఇది మరింత సానుకూల పరిణామాల్ని తీసుకొచ్చింది. మరోవైపు ఇరాన్‌పై ఇన్ని రోజులు ఉన్న ఆంక్షల్ని కూడా అమెరికా సడలించింది. ఇరాన్ చమురు క్రయవిక్రయాలకు అనుమతులు ఇచ్చింది. దీంతో మార్కెట్లో చమురు లభ్యత పెరిగి ధర తగ్గుతోంది.అయినప్పటికీ సామాన్య వినియోగదారులకు వెంటనే ఊరట కలగకపోవచ్చని భావిస్తున్నారు

**- ఎడిటర్**

## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి :కలెక్టర్, ఎస్పీ




కామారెడ్డి, జూన్ 25:మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఎస్పీ రాజేష్ చంద్ర పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కామారెడ్డి జిల్లాలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా పరిపాలన, పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ, జిల్లా సంక్షేమ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుండి నిజాంసాగర్ చౌరస్తా వరకు భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో అధికారులు, పోలీసు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొని మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసన్తూ ప్రజలను చైతన్యపరిచారు.అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు మూలస్తంభమని, మాదక ద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం, దేశ అభివృద్ధిని కూడా దెబ్బతీస్తుందని తెలిపారు. విద్యార్థులు, యువత తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించి ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు.జిల్లా పోలీసు సూపరింటెండెంట్ రాజేష్ చంద్ర మాట్లాడుతూ జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు నిరంతర నిఘా కొనసాగుతోందని చెప్పారు. మాదక ద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసు శాఖకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజ సహకారంతోనే మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా కామారెడ్డిని తీర్చిదిద్దగలమని పేర్కొన్నారు.కార్యక్రమం ముగింపులో మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, వాటి నిర్మూలనకు కృషి చేయాలని అందరితో ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎన్.వి. గిరి, జిల్లా సంక్షేమ అధికారి కుమారి ఐ. ప్రసన్న, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, పోలీసు అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.


## ఎస్ ఐ ఆర్ లో నమోదు చేసుకున్న షబ్బీర్ అలీ

కామారెడ్డి, జూన్25;ఎస్ఐఆర్‌లో తన వివరాలను నమోదు చేసుకున్న ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్. కామారెడ్డి పట్టణంలోని తన నివాసంలో ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ అలీ ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా తన ఓటరు వివరాలను నమోదు చేసుకున్నారు.ఇంచార్జ్ అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఆధ్వర్యంలో సంబంధిత అధికారులు ఓటరు నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడి ఓటు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం మరియు అధికార యంత్రాంగంపై ఉందన్నారు. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా, అలాగే అనర్హమైన లేదా డూప్లికేట్ ఓట్లు



జాబితాల్లో కొనసాగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లు, బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) మరియు బీఎల్‌వోలు (బూత్ లెవల్ అధికారులు) పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రతి ఇంటికి వెళ్లి ఓటరు జాబితాలను పరిశీలించాలని సూచించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి యువకుడు, యువతి ఓటరుగా నమోదు కావడానికి అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు.అలాగే ఒక వ్యక్తి పేరు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉంటే అలాంటి డూప్లికేట్ నమోదులను గుర్తించి తొలగించే ప్రక్రియకు సహకరించాలని అన్నారు.అదే సమయంలో నిజమైన ఓటర్ల పేర్లు తొలగించబడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.దేశవ్యాప్తంగా కొన్ని రాష్ట్రాల్లో ఓటరు జాబితాల నిర్వహణపై ప్రజాస్వామ్య వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయని అన్నారు.ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు సంపూర్ణ విశ్వాసం కలిగేలా అన్ని చర్యలు పారదర్శకంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు సమాన విలువ కలిగి ఉంటుందని, ఓటు హక్కును కాపాడటం ప్రతి రాజకీయ పార్టీతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాలు, వార్డులు, బూత్‌ల వారీగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఓటరు జాబితాలను పరిశీలించాలి. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలి.ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలంటే ప్రతి ఓటు రక్షించబడాలి. అదే సమయంలో డూప్లికేట్ అనర్హ ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా మార్చాలి" అని షబ్బీర్ అలీ అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, కార్యకర్తలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ లో కలవరం



హైదరాబాద్, జూన్ 25 (న్యూస్ పల్స్)తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల ఉదాసీన వైఖరి స్పష్టంగా కనిపిస్తుంది. ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై సీరియస్ నెస్ లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ విషయంలో ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్న నివేదికలు కాంగ్రెస్ నాయకత్వాన్ని కలవరానికి గురి చేస్తున్నాయి. ఈ విషయంలో బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు ఒకింత ముందంజలో ఉన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఇన్ ఛార్జులు మాత్రం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అందుకే రేవంత్ రెడ్డి ఉదాసీన వైఖరిని వీడకుంటే నియోజకవర్గాల్లో మరొక నేతను పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ అంటే రాజకీయ పార్టీల్లో గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఓటర్లను పెద్ద ఎత్తున తొలగించడం వల్లనే అక్కడ టీఎంసీ, డీఎంకేలు ఓటమి పాలయినట్లు కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ పదే పదే చెబుతున్నప్పటికీ తెలంగాణ కాంగ్రెస్ నేతల్లో మాత్రం మొద్దు నిద్ర వదల్లేదన్నది వాస్తవం. తన నియోజకవర్గంలో తామే కింగ్ ల మని భావిస్తున్నారు తప్పించి, ఓట్లను తొలగిస్తే రానున్న ఎన్నికల్లో గెలవలేమన్న వాస్తవాన్ని గ్రహించలేకపోతున్నారని రేవంత్ రెడ్డి సయితం ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. బూత్ లెవెల్ కమిటీలతో... మరొకవైపు బూత్ లెవెల్ కమిటీ సభ్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ లో ఏదైనా ఓట్లు తొలగిస్తే అభ్యంతరాలను తెలియజేసేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పనిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో పాటు హరీశ్ రావులు జిల్లాల్లో పర్యటిస్తూ నేతలతో సమావేశమవుతూ ఓటర్ల జాబితా సమగ్ర సవరణపై వారిని అలెర్ట్ చేస్తున్నారు. కాంగ్రెస్ లో మాత్రం అధికారంలో ఉండి కూడా తమ నియోజకవర్గంలో ఓట్లను కాపాడుకునేందుకు ఏమాత్రం ప్రయత్నించకపోవడం వల్లనే రేవంత్ రెడ్డి సీరియస్ అయినట్లు సమాచారం. ఇలాగే వ్యవహరిస్తే వచ్చే ఎన్నికలలో టిక్కెట్ ఉండదని కూడా హెచ్చరించి రేవంత్ ఎమ్మెల్యేలకు ఫుల్లు వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తన శాఖపై సంతృప్తి కరంగా లేరని తెలుస్తోంది. ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పటికీ ఆర్థిక శాఖ మరింత చికాకు తెన్నుందని మల్లు భట్టి విక్రమార్క అభిప్రాయపడుతున్నారని తెలిసింది. సంక్షేమ పథకాలకు నిధులను కేటాయించడంతో పాటు వివిధ శాఖలకు చెందిన పెండింగ్ బకాయిలను విడుదల చేయడం తనకు తలనొప్పిగా మారిందని మల్లు భట్టి విక్రమార్క తన సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు సమాచారం. గత ప్రభుత్వం చేసిన అప్పులతో పాటు ప్రస్తుతం తాము వడ్డీలు చెల్లించడంతో పాటు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కేటాయింపు కష్టంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. సంక్షేమ పథకాలకు కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తున్నప్పటికీ ఇంకా అప్పులు తేవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని ఆయన ఆవేదన చెందుతున్నారు. ఉద్యోగుల జీతాలతో పాటు వారికి అందాల్సిన ప్రయోజనాలను అందించడంతో తాను విఫలమవుతానన్న భయం మల్లు భట్టి విక్రమార్క లో మొదలయిందని ఆయన సన్నిహితులు కూడా అంటున్నారు. బడ్జెట్ లో కేటాయించిన నిధులను సర్దుబాటు చేయాలన్నా తలప్రాణం తోకకు వచ్చినట్లవుతుందని మల్లు భట్టి విక్రమార్క అంటున్నారని తెలిసింది. ఏదో ఒక కొత్త సమస్య రావడం, దానికి నిధులతో ముడిపడి ఉండటంతో తనకు ఈ శాఖ భారంగా మారిందని మల్లు భట్టి విక్రమార్క భావిస్తున్నారు. నెల మొదటి వారం వచ్చిదంటే చాలు భయం వేస్తుందని ఆయన ఆందోళన చెందుతున్నారు. దీంతో పాటు వివిధ సంఘాలతో వరసగా తానే సమావేశాలను ఏర్పాటు చేసి నిధుల సర్దుబాటు చేయడానికి వారిని బుజ్జగించాల్సి వస్తుందని, నిధులు సకాలంలో విడుదల చేయకపోతే మాట తప్పిన వారమవుతామని మల్లు భట్టి విక్రమార్క ఆవేదన చెందుతున్నారు. ఖజానా బోసి పోయి ఉండటం, ప్రతి నెలా అప్పులు తేవడం తనకు సమస్యగా మారిందని, వీలయినంత వరకూ త్వరలోనే ఈ శాఖను వదిలించుకోవాలన్న భావనలో మల్లు భట్టి విక్రమార్క ఉన్నట్లు చెబుతున్నారు.

## గాంధీ భవన్‌ను ముట్టడించిన లంబాడీ నేతలు..




లంబాడీల ఓట్లతో గెలిచి.. ఆ జాతిని మోసం చేసి.. తిరిగి తాజాగా బస్సు యాత్ర పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి కొత్త డ్రామా ఆడుతున్నాడని సేవాలాల్ బంజార సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కొర్ర మోతీలాల్ నాయక్ ఇప్పటికే ఆరోపించారని తెలిసిందే. బస్సు యాత్రతో తండాలకు వస్తే చీపుర్లు, చెప్పులదండలతో గిరిజనులు సిద్ధంగా ఉండాలని పిలుపు కూడా ఇచ్చారు.ఈ క్రమంలో లంబాడి నేతలు ఇవాళ గాంధీ భవన్‌ను ముట్టడించారు. లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఖబడ్దార్ రేవంత్ రెడ్డి.. బస్సు యాత్రను ఆపాలి.. లంబాడిలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాకే బస్సు యాత్ర చేయాలని ఆందోళన చేపట్టడంతో రంగంలోకి దిగిన పోలీసులు లంబాడ నేతలను అరెస్ట్ చేశారు.

## మంచిర్యాలలో కత్తులతో పొడిచి వ్యక్తి దారుణ హత్య



మంచిర్యాల అర్బన్ జూన్ 25 : మంచిర్యాలజిల్లా కేంద్రంలోని అండాళమ్మ కాలనీ జలగుట్ట ప్రాంతంలో ఓ వ్యక్తి దారుణ హత్యకుగురైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మహబూబాబాద్ జిల్లా బయ్యారం ప్రాంతానికి చెందిన లాక్‌పతి అనే వ్యక్తిని గుర్తుతెలియని దుండగులు కత్తులతో పొడిచి హత్య చేసినట్లు సమాచారం.స్థానికుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## గోడౌన్ కూలిన ఘటనలో 8కి చేరిన మృతులు



కోల్‌కతా, జూన్ 25: నగరంలోని తరతల ప్రాంతంలో గోడౌన్ కుప్పకూలిన సంఘటనలో మరణించిన వారి సంఖ్య 8కి పెరిగింది. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించామని అధికారులు వివరించారు. మరో18 మంది గోడౌన్ శిథిలాల కింద చిక్కుకున్నారని తెలిపారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో గోడౌన్‌లో 60 మంది వరకు కార్మికులు ఉన్నారని వివరించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భారత ఆర్మీ, నగర పోలీసులతోపాటు స్థానికుల సహకారంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే మంత్రులతో కలిసి సీఎం సువేందు అధికారి ఘటన స్థలానికి చేరుకున్నారు. స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షించారు. మరో వైపు బాధితుల కుటుంబ సభ్యుల కోసం రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ కంట్రోల్ రూం.. 8697981070, 033 22143526, 033 22535185 నెంబర్లు విడుదల చేసింది. బుధవారం సాయంత్రం ఈ గోడౌన్ కూలిన సంగతి తెలిసిందే. తొలుత ఐదుగురు కార్మికులు మరణించారు. ఆ సంఖ్య బుధవారం ఎనిమిదికి చేరింది.

## విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిన కేంద్ర ప్రభుత్వం

సికింద్రాబాద్.. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థను, పరీక్షల విధానాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని సికింద్రాబాద్ డిసిసి అధ్యక్షుడు దీపక్ జాన్ మండిపడ్డారు. ఇటీవల నీట్ పరీక్షకు సంబంధించిన పరీక్ష పత్రాలు లీకైన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును తప్పుపడుతూ వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం పరీక్షలు నిర్వహించడంలో పూర్తి విఫలమైందని తీవ్ర విమర్శలు చేశారు.నీట్ పరీక్ష రద్దవడంతో విద్యార్థులు తీవ్ర నిరాశకు లోనై ఆత్మహత్యలకు చేసుకున్నారని ప్రైవేటు కోచింగ్ సెంటర్లలో లక్షల రూపాయలు కట్టి నేర్చుకున్న విద్య పేపర్ లీకేజీతో పూర్తిగా నీరుగారిపోయిందని అన్నారు.. ఏ ఐ సి సి అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ తీరును ప్రజల్లో విద్యార్థులలో ఎండగడుతున్నట్టు వెల్లడించారు.

కింగ్



## తెలంగాణ ఎక్సైజ్ శాఖలో భారీగా బదిలీలు.. గ్రేటర్ హైదరాబాద్ డీసీగా శ్రీనివాస్‌రెడ్డి




హైదరాబాద్ : రాష్ట్రంలో పలు జిల్లాల్లో ఎక్సైజ్ శాఖ లో డిప్యూటీ కమిషనర్లుగా పనిచేస్తున్న అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. మరికొందరికి కొత్తగా పోస్టింగులు ఇస్తూ ప్రభుత్వ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న జె హరికిషన్‌ను సైబరాబాద్ డీసీగా, నల్గొండలో డీసీగా పనిచేస్తున్న ఏ శ్రీనివాస్‌రెడిని గ్రేటర్ హైదరాబాద్ డీసీగా బదిలీ చేశారు.రంగారెడ్డి డీసీగా ఉన్న దశరథను టీజీబీసీఎల్ డీసీగా, ఖమ్మంలో డీసీగా ఉన్న జనార్దన్ రెడ్డి ఆదిలాబాద్ డీసీగా బదిలీ చేశారు. టీజీబీసీఎల్ ఆర్‌ఆర్-1లో ఉన్న దాతురాజు గౌడ్‌ను వరంగల్ డీసీగా, నిజామాబాద్‌లో ఏసీగా ఉన్న వి.సోమిరెడ్డిని ఖమ్మం డీసీగా, కరీంనగర్ బీసీఎల్‌లో మేనేజర్‌గా ఉన్న రవీకుమార్‌ను కరీంనగర్ డీసీగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ లేబుల్స్‌లో పనిచేస్తున్న పి శ్రీధర్‌ను నిజామాబాద్ డీసీగా, హెడ్‌క్వార్టర్స్‌లో డీసీగా ఉన్న కె రఘురాంను రంగారెడ్డి డీసీగా, హైదరాబాద్ ఏసీగా ఉన్న ఏ అనిల్ కుమార్ రెడ్డిని ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ప్రభుత్వం బదిలీ చేసింది.స్పెషల్ టాస్క్ ఫోర్స్‌లో ఏసీగా ఉన్న పి ప్రణవిని మల్కాజిగిరి డీసీగా, మహబూబ్ నగర్ ఏసీ విజయ్ భాస్కర్ రెడ్డి డీసీ అక్కడే పదోన్నతి కల్పించింది. బ్రేవరీస్‌లో ఏసీగా ఉన్న చంద్రయ్యను మెదక్ డీసీగా, ఈస్ట్ జాయింట్ డైరెక్టర్‌గా ఉన్న సీవీ శశిధర్ రెడ్డిని నల్గొండ డీసీగా బదిలీ చేసింది. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ప్రభుత్వం ఆదేశించింది .

## ఐఎస్ సదన్ ఏటీఎం చోరీ కేసులో ట్విస్ట్.. డబ్బుతో పరారైంది తండ్రీకొడుకులే




హైదరాబాద్ : హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ఏటీఎం చోరీ ఘటనను పోలీసులు ఛేదించారు. ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్, అతని ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సీసీఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కాగా, ఏటీఎంలకు నగదు సరఫరా చేసే క్యాష్ వాహన డ్రైవర్ రూ.17 లక్షల నగదుతో పరారైన సంఘటన మంగళవారం ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో కలకలం రేపింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాశ్‌గౌడ్ కథనం ప్రకారం.. ఎస్బీఐ బ్యాంక్ క్యాష్‌ను ఏటీఎంలలో డిపాజిట్ చేసే టీమ్ పోస్ ఏజెన్సీలో కరీంనగర్ జిల్లా జగిత్యాలకు చెందిన శ్రీనివాస్ 4 నెలల క్రితం డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరి ప్రస్తుతం బాలానగర్‌లో నివాసముంటున్నాడు.మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో సంతోష్‌నగర్-రెయిన్ బజార్ ప్రధాన రహదారిపై ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేయడానికి వచ్చారు. ఎస్బీఐ బ్యాంక్ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేయడానికి వెళ్తున్న సమయంలో ముందుగా వేసుకున్న ప్రథకం ప్రకారం వాహన డ్రైవర్ శ్రీనివాస్ అక్కడికి ముందుగానే పిలిపించుకున్న బైక్‌పై అదను చూసి రూ.17లక్షలు ఉన్న బ్యాగ్‌ను తస్కరించి పరారయ్యాడు. వెంటనే టీమ్ పోస్ ఏజెన్సీ సంస్థ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఐఎస్ సదన్ పీఎస్ ఎస్ఐ సాయి ప్రకాశ్‌గౌడ్ స్పాట్‌కు చేరుకొని సీసీ పుటేజ్, వివరాలను సేకరించారు.

## పాక్ గగనతలంలోకి ఎయిర్ ఇండియా విమానం..

అమృత్‌సర్, జూన్25: పాకిస్థాన్ గగనతలంలోకి ఎయిర్ ఇండియా విమానం ప్రవేశించడంపై ఆ సంస్థ స్పందించింది. ఈ ఘటనను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. దీనిపై అంతర్గత విచారణ జరుగుతోందనిఎయిర్ ఇండియా వివరించింది. ఈ మేరకు ఎయిర్ ఇండియా ఒక ప్రకటనలో వెల్లడించింది. జూన్ 22వ తేదీన ఏఐ479 విమానం ప్రయాణికులతో న్యూఢిల్లీ నుంచి అమృత్‌సర్‌కు బయలుదేరిందని చెప్పిందిఅమృత్‌సర్‌లోని శ్రీ గురు రామ్ దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో ఆ విమానం దిగాల్సి ఉందని వివరించింది. అయితే ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్‌కు అనుమతి రాక పోవడంతో విమానం గో అరౌండ్ ప్రక్రియ చేపట్టిందని తెలిపింది. ఆ క్రమంలో విమానం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించిందని పేర్కొంది. విమానంలోని ప్రయాణికులు, సిబ్బంది భద్రతే తమకు అత్యంత ప్రాధాన్యమని ఎయిర్ ఇండియా సంస్థ స్పష్టం చేసింది.




# పోలీసుల్ని చితకబాదిన 40 మంది ఆర్మీ సిబ్బందిపై కేసు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని కిష్టవార్ జిల్లాలో ఉన్న అథోలి పోలీసు స్టేషన్‌పై దాడి చేసిన ఘటనలో సుమారు 40 మంది ఆర్మీ సిబ్బందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆర్మీ సిబ్బందిలో ఓ కమాండింగ్ ఆఫీసర్, మేజర్ కూడా ఉన్నారు. ఓ వాహనాన్ని సీజ్ చేసిన ఘటనలో పోలీసులు, ఆర్మీ సిబ్బంది మధ్య వాగ్వాదం జరిగింది. అయితే అథోలీ పోలీసు స్టేషన్‌కు కర్రలు, రాడ్లతో వచ్చిన ఆర్మీ సిబ్బంది.. విధులు నిర్వహిస్తున్న పోలీసులపై విచక్షణారహితంగా దాడి చేశారు. 17 రాష్ట్రీయ రైఫిల్స్ కమాండింగ్ ఆఫీసర్, ల్నల్ ఎన్ అరుణ్ గాంధీ, మేజర్ వికాశ్ శర్మ, నయిబ్ సుబేదార్ శంకర్ గుర్కేతో పాటు సుమారు 40 మంది వరకు గుర్తు తెలియని ఆర్మీ సిబ్బంది పోలీసు స్టేషన్‌పై



దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.ప్రభుత్వ ఆఫీసర్లపై దాడి, స్టేషన్ పరిధిలోనే పోలీసు సిబ్బందిపై దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమానిత వ్యక్తులపై హత్యాయత్నం, పబ్లిక్ ప్రాపర్టీ ధ్వంసం ఆరోపణలు ఎదుర్కోనున్నారు. ఈ ఘటనలో దర్యాప్తునకు సహకరించనున్నట్లు ఆర్మీ ప్రకటించింది. సంయుక్త దర్యాప్తు అనంతరం తగిన రీతిలో చర్యలు తీసుకుంటామని రక్షణ శాఖ ప్రతినిధి ఒకరు తెలిపారు. డీఎస్పీ విజయ్ కుమార్ భగత్, స్టేషన్ హౌజ్ ఆఫీసర్ అమృత్ కాటోచ్ ఉన్నారు. మేజర్ వికాశ్ శర్మ చాలా దురుసుగా ప్రవర్తించారని, భౌతిక దాడికి పాల్పడ్డారని, ఎస్డీపీఓపై దాడి చేశారని డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.ముందస్తు ప్లాన్‌తోనే ఆర్మీ సిబ్బంది దాడి చేశారని, ఆ దాడిలో అనేకమంది పోలీసులు గాయపడినట్ల ఎఫ్ఐఆర్‌లో తెలిపారు. లాఠీలు, ఐరన్ రాడ్లు, సర్వీస్ వెపన్స్‌తో ఆర్మీ సిబ్బంది కొట్టేందుకు వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. కిష్టవార్ అసిస్టెంట్ రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఓ ఆర్మీ వాహనాన్ని సీజ్ చేయడం వల్ల ఈ ఘటన జరిగింది.

# ఈపీఎఫ్‌వో సభ్యులకు అలర్ట్..

### రెండు రోజులు పోర్ట్ సేవలు బంద్.. ఎప్పటినుంచంటే

ఈపీఎఫ్‌వో సభ్యులకు ఆ సంస్థ కీలక సూచన చేసింది. రెండు రోజులపాటు ఈపీఎఫ్‌వో సేవలు తాత్కాలికంగా నిలిచిపోనున్నట్లు తెలిపింది. పోర్టల్‌లో సాంకేతికపరమైన అప్‌డేట్స్ చేపడుతున్న నేపథ్యంలో జూన్ 26, అర్ధరాత్రి 12.00 గంటల నుంచి జూన్ 28 అర్ధరాత్రి 11.59 నిమిషాల వరకు పోర్టల్‌కు సంబంధించినవ వివిధ సేవలు నిలిచిపోతాయని సంస్థ వెల్లడించింది. పోర్టల్ నిర్వహణా సంస్థ దీనికి సంబంధించిన డాటా బేస్‌ను తన అధీనంలోకి తీసుకుని, పలు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు చేయనుంది.వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు వేగంగా అందించేందుకే ఈ అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు సంస్థ తెలిపింది. అందువల్ల వినియోగదారులు ఈ పోర్టల్ సేవలు వాడాలి అనుకుంటే సేవలు నిలిచిపోకముందే వినియోగించుకోవాలని సూచించింది. పోర్టల్ తాత్కాలికంగా పని చేయని రోజులకు అనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని సూచించింది. అయితే, అన్ని సేవలకు సమస్య ఉండకపోవచ్చని, కొన్ని సేవలు మాత్రం రెండురోజులు నిలిచిపోతాయని పేర్కొంది. కొత్త క్లెయిమ్ రిక్వెస్ట్ ఫాంలు సమర్పించడం, క్లెయిమ్ ప్రాసెసింగ్ సర్వీసెస్, మైగ్రేషన్ పీరియడ్‌కు సంబంధించిన క్లెయిమ్‌లు సమర్పించడం వంటివి నిలిచిపోవచ్చు. అయితే, మిగిలిన కొన్ని సేవల్ని పొందేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు కూడా ఉన్నాయి.అవి ఉమాంగ్ యాప్, ఎస్ఎంఎస్, వాట్సాప్, మిస్డ్ కాల్ సర్వీసెస్ వంటివి వినియోగించుకోవచ్చు. పీఎఫ్ బ్యాలెన్స్ చెక్ చేసుకోవడం, పాస్‌బుక్, క్లెయిమ్ స్టేటస్ వంటివి చూసుకోవచ్చు. అత్యవసరంగా పీఎఫ్ విత్‌డ్రా క్లెయిమ్ చేసుకోవాలనుకునే వారు జూన్ 25, అంటే ఈ రోజు అర్ధరాత్రి లోపే ఫాంలు సమర్పించాలి. త్వరలోనే ఈపీఎఫ్‌వోలో ఏటీఎం విత్‌డ్రా సదుపాయం అందుబాటులోకి రానున్నాయి. అలాగే, సభ్యులకు అకౌంట్‌లోని అమౌంట్‌పై వడ్డీ ఈ నెలలోనే జమ అయ్యే ఛాన్స్ ఉంది.




# నల్లగొండలో ఒకే ఇంట్లో నలుగురు మృతి కేసులో వీడిన మిస్టరీ

హైదరాబాద్ : నల్లగొండలో ఒకే ఇంట్లో నలుగురు మృతి చెందిన కేసులో మిస్టరీ వీడింది. నల్లగొండ జిల్లా కేంద్రం సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన మహమ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీనా (40), కుమారుడు ముజమిల్(20), కుమార్తె అక్సర (11) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హత్యకు గురైన హసీనా మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి సుపారీ గ్యాంగ్ చేత హత్య చేయించినట్లు నిర్ధారణ అయింది.హసీనాకు గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. నల్లగొండకు చెందిన మహ్మద్ సుల్తాన్‌ను మూడో వివాహం చేసుకుంది. సుల్తాన్‌కు కూడా గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. సుల్తాన్ మొదటి భార్య పిల్లలు మహ్మద్ ముజమిల్, అప్సరతో కలిసి నల్లగొండలో జీవిస్తున్నారు. హసీనా పేరు మీద కోటి రూపాయల విలువైన స్థలాలు, ఇండ్లు ఉన్నాయి.ఆ ఆస్తిని తమకు ఇవ్వకుండా తన మూడో భర్త అయిన సుల్తాన్ పిల్లల మీద వీలునామా రాస్తున్నట్లు హసీనా చెప్పడంతో కక్ష పెంచుకొని, హసీనా మొదటి భర్త కూతురు, అల్లుడు కలిసి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీ షీటర్ల చేత హత్య చేయించి పోలీసులు నిర్ధారించారు. పోస్టుమార్టం నివేదిక ప్రకారం.. సుల్తాన్ మృతదేహంపై 6 చోట్ల కత్తి గాయాలు ఉండగా, హసీనాకు 7 చోట్ల, కుమార్తె అక్సరకు 9 చోట్ల, ముజమిల్‌కు ఏకంగా 16 కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## అంగన్‌వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది : సత్యవతి రాథోడ్

హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చింది. అంగన్‌వాడీల రిక్రూట్ మెంట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి తెరలేపింది అని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ విమర్శించారు. గురువారం ఆమె తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అంగన్ వాడీలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. అంగన్‌వాడీలకు కేసీఆర్ ప్రభుత్వం పీఆర్సీ ఇచ్చిందన్నారు.ప్రతిసంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందన్నారు.కలెక్టర్లు ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా మారిపోయారు. అంగన్‌వాడీ రిక్రూట్ మెంట్ కు ఇచ్చిన కొత్త జీఓను మార్చాలన్నారు. మినీ అంగన్ వాడీలను కేసీఆర్ ప్రభుత్వం హయాంలో అప్ గ్రేడ్ చేశాం. మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి సీతక్క మేము అప్ గ్రేడ్ చేసిన వాటిని మరోసారి మినీ అంగన్ వాడీలను అప్ గ్రేడ్ చేస్తూ తొలి సంతకం పెట్టారని ఎద్దేవా చేశారు.ఇప్పటి వరకు వారికి జీతాలు ఇవ్వడం లేదు. అంగన్ వాడీ వ్యవస్థను అవినీతి మయం చేశారని మండిపడ్డారు. అంగన్ వాడీ టీచర్లకు రూ.13,650 జీతం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ హయాంలో పారదర్శకంగా అంగన్ వాడీ నియామకాలు జరిగాయని, కాంగ్రెస్ పార్టీ వారి కార్యకర్తలకు దోచిపెట్టాలని చూస్తున్నదని మండిపడ్డారు. దీంతో అర్హులు అంగన్ వాడీ ఉద్యోగాలు కోల్పోయే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎస్టీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ బస్సు యాత్రలు చేయడం సిగ్గుచేటన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని రేవంత్ రెడ్డి ఆదివాసీలతో సుప్రీంకోర్టులో కేసు వేయించారు. లంబాడాలకు, ఆదివాసీలకు మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. రేవంత్ రెడ్డికి లంబాడాలు కర్రు కాల్చి వాతలు పెట్టడం ఖాయమన్నారు.

## పెళ్లి వద్దని చెప్పి ఉండొచ్చు కదా.. ఎందుకు చంపారు: కేతన్ తండ్రి ఆవేదన



కాబోయే భార్య సియా గోయల్, చేతన్ చౌధరితో ప్రేమలో ఉందనే విషయం కేతన్ అగర్వాల్‌కు ఏమాత్రం తెలియదని ఆయన తండ్రి విశాల్ అగర్వాల్ తెలిపారు. అయితే సియా ఫోన్ గంటల తరబడి బిజీగా ఉండటంతో ఏదో తేడాగా ఉందని మాత్రం కేతన్‌కు అనిపించిందని తెలిపారు. ఒకవేళ సియా వేరొకరితో ప్రేమలో ఉన్నట్లు తెలిసి ఉంటే, తమ కుటుంబం పెళ్లిని రద్దు చేసుకునేదని విశాల్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని పుణె సమీపంలోని లోహగడ్ కోట వద్ద జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసు దేశవ్యాప్తంగా సంచలనం రేపుతోంది పెళ్లి ఇష్టం లేదని ముందే చెప్పి ఉంటే, తమ కుటుంబం వివాహాన్ని వెంటనే రద్దు చేసేదని విశాల్ అన్నారు. అమాయకుడైన తన కుమారుడిని హత్య చేయాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. 'ఆమె సంతోషంగా లేదని మాకు తెలియదు. రోజు విడిచి రోజు కేతన్, సియా డిన్నర్లకు వెళ్లేవారు. సియా తన అఫైర్ గురించి కేతన్‌కు ఎప్పుడూ చెప్పలేదు. అయితే, సియా ఫోన్ ఎప్పుడూ బిజీగా ఉంటుందని కేతన్ ఒకసారి నాతో చెప్పాడు' అని విశాల్ చెప్పారు ఫోన్ ఎప్పుడూ బిజీగా ఉండటం గురించి కేతన్ నిలదీయగా, తాను తన స్నేహితులతో మాట్లాడుతున్నానని సియా చెప్పిందని విశాల్ పేర్కొన్నారు 'కేతన్‌ను పెళ్లి చేసుకోవాలని మేము సియాను బలవంతం చేయలేదు. అయితే సియా ప్రేమ వ్యవహారం గురించి ఆమె తల్లిదండ్రులకు, అత్తకు ముందుగానే తెలిసి ఉండొచ్చు. వారే కేతన్‌ను పెళ్లి చేసుకోవాలని సియాపై ఒత్తిడి తీసుకొచ్చి ఉంటారు. అన్ని విషయాలు పోలీసుల దర్యాప్తులో తెలుస్తాయి' అని విశాల్ తెలిపారు.

## వాష్ రూమ్‌కు వెళ్లిన మహిళపై దాడి .. గోల్డ్‌చైన్‌తో పరారైన దుండగుడు



వినాయక నగర్, జూన్, 25 : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళ వాష్ రూమ్‌కు వెళ్లడాన్ని గమనించిన దుండగుడు ఆమె పై దాడి చేశాడు. ఆమె అరిచేలోపే సదరు మహిళ మెడలోని 5 తులాల బంగారు గొలుసు తెంచుకొని పరారయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని ఆర్య నగర్ ప్రాంతంలో గల ఎఫ్‌సీఐ కాలనీలో నివాసముండే కొట్టే నాగమణి అనే మహిళ బుధవారం అర్ధరాత్రి సుమారు 2గంటల సమయంలో తమ ఇంటి బయట ఉన్న వాష్ రూమ్‌కు వెళ్లేందుకు ఇంట్లోంచి బయటకు వచ్చింది.అదే సమయంలో అక్కడ మాటు వేసి ఉన్న ఓ దుండగుడు ఆమె మెడలోని ఐదు తులాల బంగారు పుస్తెలతాడు తెంచుకొని పరాయ్యాడు. నగామణి గట్టిగా అరవడంతో కాలనీవాసులు మేల్కొని పోలీసులకు సమాచారం అందించారు. కాలనీవాసులు, పోలీసులు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించి దుండగుడిని పట్టుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న దుండగుడు నిజామాబాద్ రూరల్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటాడని సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## 40 సెకన్ల తేడాలో రెండు భూకంపాలు.. 32 మంది మృతి, 700 మందికి గాయాలు

కారకాస్: వెనిజువెలాలో ఇవాళ కేవలం నిమిషం తేడాలో రెండు సార్లు భారీ భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండు సార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది.డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ధ కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.



# ఆరుద్ర కార్తె వచ్చినా..వాన జాడేది

హైదరాబద్, జూన్ 25 (న్యూస్ పల్స్) మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల వానాకాలంలో వానల జాడ కానరావడం లేదు. మృగశిర కార్తె ముగిసి ఆరుద్ర కార్తె ప్రవేశించినా ఆకాశంలో కారు మబ్బులు కనిపించడం లేవు. ఇటీవల కురిసిన తొలకరి వర్షంతో పులకరించిన రైతన్న వానకాలం సాగుకు సిద్ధం చేసిన పొలాల్లో పత్తి, కంది వంటి పంటల విత్తనాలు తొందరపడి భూమిలో విత్తారు. అయితే భూమిలో విత్తనాలు విత్తిన తర్వాత వాన దేవుడు ముఖం చాటేశాడు. దీంతో రైతన్నలు వర్షం కోసం ప్రతిరోజూ ఆకాశం వైపు చూసున్నా వరుణ దేవుడు మాత్రం కనిపించడం లేదు. దీంతో రైతన్న కన్నీరుమున్నీరు అవుతున్నాడు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించినా సీజన్ ఆరంభంలోనే తీవ్ర వర్షపాత లోటు ఏర్పడింది. మధ్య పసిఫిక్ మహాసముద్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ఆందోళన చెం దుతున్నారు.ఎల్‌నినో ప్రభావం కారణంగా ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురుస్తాయని తొలకరి వర్షానికి రైతులు ఎవరూ పంటలు సాగు చేయవద్దని వ్యవసాయశాఖ అధికారులు సూచించినప్పటికీ రైతులు తొందరపడి అక్కడక్కడ పావుల వంతు భూమిలో విత్తనాలు విత్తారు. విత్తనాలు విత్తని రైతులు అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్నారు. విత్తిన రైతులు సాగు కోసం ఖర్చు చేసిన పెట్టుబడులు బూడిదలో పోసిన పన్నీరేనా అని కుమిలిపోతున్నారు.మరోవైపు ఎల్‌నినో ప్రభావం 2027 వరకు కొనసాగుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కోయిస్) ఎల్ నినోపై తాజాగా బులెటిన్ విడుదల చేసింది. ఇందులో 2026 జూన్ నుంచి 2027 ఫిబ్రవరి ఎల్‌నినో ప్రభావం కొనసాగుతుందని అంచనా వేశారు. ఈ అవకాశం 70 నుంచి 90 శాతం మధ్య ఉందని, ఆ సంస్థ తెలిపింది. సముద్రంలోవాతావరణ పరిస్థితుల్లో మార్పులు అంత వేగంగా రానప్పటికీ 2027 రుతుపవన కాలం కూడా దీని వల్ల ప్రభావితమయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుతం పరిణామాల దృష్ట్యా చాలా వరకు ఇది జరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా 2026 జూన్ నుంచి 2027 ఫిబ్రవరి వరకు ఉండే కాలంలో ఎల్ నినో అనేది ఈఎన్ఎస్‌వో దశగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఎల్‌నినో వల్ల ఉత్తర హిందూ మహాసముద్రం అంతటా సముద్ర పరిస్థితులు ప్రభావితం కానున్నాయి. దీని ఫలితంగా అధిక సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు, సముద్ర ఉపరితల భాగంలో ఉష్ణ పరిమాణం పెరగడం, సముద్ర వడగాడ్పులు పెరగడం వంటివి సంభవిస్తాయని వాతావరణ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పరిస్థితులు బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని సముద్ర వాతావరణ వ్యవస్థలు, మత్స్య సంపద, తీరప్రాంత పర్యావరణాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.

# దారుస్సాలామ్ కి ఏమైంది..

హైదరాబాద్ జూన్ 25 దారుస్సలామ్.. హైదరాబాద్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరు. ఎంఐఎం పార్టీ కేంద్రకార్యాలయమే దారుస్సలామ్. ఒకప్పుడు .. ఈ కార్యాలయం వచ్చిపోయే వారితోనే కాదు.. పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిండుగా కిక్కిరిసి ఉండేది. తమ సమస్యలు చెప్పుకొనే వారు కూడా పెద్ద ఎత్తున తరలి వచ్చే వారు. పార్టీ చీఫ్.. అసదుద్దీన్ ఓవైసీ ఉన్నా.. లేకపోయినా.. పార్టీ కార్యాలయం మాత్రం నిండుగా కనిపించేది. ముఖ్యంగా యువత ఎక్కువగా ఇక్కడ తిష్ఠవేసుకుని పార్టీ కోసం పనిచేసిన పరిస్థితి కూడా ఉండేది. కానీ.. గత రెండు మాసాలుగా దారుస్సలామ్ బోసిపోయిన పరిస్థితిని నెలకొంది. వచ్చేవారు లేరు. వచ్చినా.. ఇక్కడ సమాధానం ఇచ్చేవారుకూడా లేకుండా పోయారన్న వాదన వినిపిస్తోంది. హైదరాబాద్ ఎంపీగా అసదుద్దీన్ ప్రాతినిధ్యం వహిస్తున్నా.. జాతీయ రాజకీయాలపై ఆయన ఎక్కువగా దృష్టి పెట్టారు. యూపీ సహా.. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఎంఐఎం జాడలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇటీవల జరిగిన పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లోనూ ఎంఐఎం పోటీ చేసింది. గతంలో బీహార్‌లోనూ పార్టీ పోటీ ఇచ్చింది.దీంతో అసదుద్దీన్.. జాతీయ రాజకీయాలపైనే ఎక్కువగా దృష్టి పెట్టారని తెలుస్తోంది. ఇక, ఆయన సోదరుడు, ఎమ్మెల్యే అక్బరు ద్దీన్ .. కేవలం అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పుడే కనిపిస్తున్నారని సమాచారం. ఎక్కువ భాగం.. విదేశాల్లోనే ఉంటున్నారని పార్టీ నాయకులు చెబుతున్నారు. దీంతో పార్టీకార్యాలయంలో కార్యక్రమాలు మందగించాయి. అదేసమయంలో వచ్చిపోయే వారి సంఖ్య కూడా తగ్గిపోయింది. ఇదిలావుంటే.. హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లో ఎంఐఎం పార్టీకి ఏళ్ల తరబడి తిరుగులేదన్న వాదన తెలిసిందే అంతేకాదు.. భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో ఓవైసీ కుటుంబానికి చెందిన నాల్గవ తరం వారసుడు అక్బరుద్దీన్ ఓవైసీ కుమారుడు నూరుద్దీన్ ఓవైసీ రాజకీయ రంగప్రవేశం చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. కానీ, ఆ జాడ కూడా ఎక్కడా కనిపించడం లేదు. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇదే పాత బస్తీకి చెందిన మరో పార్టీకి అండగా ఉంటున్నదన్న సమాచంర హల్చల్ చేస్తోంది. దీంతో ఎంఐఎం ప్రభ తగ్గుతోందా? అనేది చర్చకు దారితీసింది. ఇక, జాతీయస్థాయిలో దృష్టి పెట్టినా.. ఎంఐఎంకు అనుకున్నంత మైలేజీ లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. ఇలా.. స్థానికంగా దృష్టి పెట్టకపోవడం, ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్ననేపథ్యంలో దారుస్సలామ్‌లో జనాల తాకిడి తగ్గిపోగా.. పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనిని సరిచేసుకుంటారా? లేక... ఇంతే అని వదిలేస్తారో చూడాలి.

# ఇరవై రోజుల్లో వీటి ధరలు

## 15 శాతం నుంచి 20శాతం

హైదరాబాద్, జూన్ 25 (న్యూస్ పల్స్)పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా పేద, మధ్య తరగతి వర్గాలపై ఇప్పటికే గ్యాస్, ఇంధన, నిత్యావసర సరకుల ధరల భారం పడింది. వీటి ధరలు పెరగడంతో ఆయా వర్గాల ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయా వర్గాలకు మరో బిగ్ షాక్ తగిలింది. ప్రస్తుతం సన్నబియ్యం ధరలు కూడా భారీగా పెరుగుతున్నాయి.గడిచిన ఇరవై రోజుల్లో వీటి ధరలు ఏకంగా 15 శాతం నుంచి 20శాతం వరకు పెరిగినట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా జేఎస్ఆర్, ఆర్ఎన్ఆర్, హెచ్ఎంటీ, బీపీటీ రకాలపై ఈ ప్రభావం భారీగా కనిపిస్తోంది. గతంలో కిలో రూ. 46 నుంచి రూ.55 ఉంటే.. ఇప్పుడు స్టీం, రారైస్ తక్కువ రకం, ప్రీమియం క్వాలిటీని బట్టి రూ.55 నుంచి రూ.63 వరకు చేరాయి. పావుకిలో బియ్యం బ్యాగ్ పై సుమారు రూ. 180 నుంచి రూ.200 పెరుగుదల చోటు చేసుకుంది.సన్నబియ్యం ధరలు పెరగడానికి ప్రధాన కారణాలివే..? తెలంగాణలో ప్రభుత్వం సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఖరీఫ్ లో సాగైన పంట ఉత్పత్తులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు భారీగా వెళ్లాయి.

# వేడెక్కిన నార్త్ పాలిటిక్స్

లక్నో జూన్ 25 (న్యూస్ పల్స్)త్వరలో కేంద్ర మంత్రివర్గంతో పాటు బీజేపీ సంస్థాగత నిర్మాణంలో పెద్ద ఎత్తున మార్పులకు అవకాశాలు కనిపిస్తున్నాయి. దాంతో ఉత్తరాదిన పాలిటిక్స్ హీటెక్కాయి. ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భేటీ అయ్యారు. 2027 ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో తమ పట్టును బలోపేతం చేసుకునే వ్యూహంలో భాగంగానే బీజేపీ కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కసరత్తు చేస్తోందని తెలుస్తోంది.కేంద్ర మంత్రి జార్జ్ కురియన్ రాజ్యసభ పదవీ కాలం ముగియడం, ఆయనను మళ్లీ ఎగువ సభకు పంపకూడదని నిర్ణయించడంతో కేంద్ర కేబినెట్‌లో కేరళ ప్రాతినిధ్యంపై కొత్త చర్చ మొదలైంది. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని మంత్రివర్గంలో కేరళకు మరో అవకాశం ఉంటుందా లేదా అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేరళ నుంచి ఉన్న ఏకైక బీజేపీ మంత్రి, నటుడు సురేష్ గోపి మాత్రమే. ఆయన త్రిసూర్ లోక్‌సభ స్థానం నుంచి విజయం సాధించి మోదీ కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. కేంద్ర కేబినెట్ భేటీ కానుందని, ఆ తర్వాత మంత్రుల శాఖల మార్పు లేదా కొత్త వారికి కేబినెట్ లోకి తీసుకోవడంపై ప్రకటన రావచ్చని తెలుస్తోంది. ఇద్దరు కేంద్ర మంత్రులు జార్జ్ కురియన్, రవ్‌నీత్ సింగ్ బిట్టూలను బీజేపీ మళ్లీ రాజ్యసభకు పంపలేదు. మరోవైపు బిట్టూ ఇంకా రాజీనామా చేయలేదు. అయితే, తాను పంజాబ్ రాజకీయాల్లోకి తిరిగి వస్తున్నానని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని స్పష్టం చేశారు.'ఒక వ్యక్తి, ఒకే పదవి' బీజేపీ రూల్ పాటించడం ద్వారా మరో ఇద్దరు మంత్రులకు పదవీగండం ఉంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పంకజ్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. వచ్చే ఏడాది ప్రారంభంలో యూపీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న క్రమంలో బీజేపీ నిబంధనల ప్రకారం పంకజ్ చౌదరి కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. 80 లోక్‌సభ స్థానాలు ఉన్న యూపీలో, గత అసెంబ్లీ ఎన్నికల్లో అఖిలేష్ యాదవ్ బీజేపీకి గట్టి షాక్ ఇచ్చారు.దీంతో కేంద్ర ప్రభుత్వం పంకజ్ చౌదరి స్థానంలో మరో ఓబీసీ లేదా దళిత నేతకు.. ముఖ్యంగా పూర్వాంచల్ ప్రాంతానికి చెందిన వారికి మోదీ కేబినెట్‌లో చోటు కల్పించవచ్చు. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్‌ల (వెనుకబడిన, దళిత, మైనారిటీ) ఫార్ములాను తిప్పికొట్టేందుకు బీజేపీ ఈ మార్పుల ద్వారా కొత్త వారికి ఛాన్స్ ఇచ్చి యూపీలో సోషల్ బ్యాలెన్స్ సాధించాలని చూస్తోంది.వచ్చే ఏడాది పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రవ్‌నీత్ బిట్టూ రాజ్యసభ పదవీ కాలం ముగియడంతో పంజాబ్ నుంచి ఒక మంత్రి పదవి ఖాళీ అవుతుంది. బీజేపీ ఇక్కడ కేవల్ సింగ్ ఢిల్లాన్‌ను పంజాబ్ అధ్యక్షుడిగా నియమించింది. ఒక హిందువుకు కేబినెట్‌లో అవకాశం ఇస్తుందని సమాచారం. మంత్రి పదవి రేసులో రాఘవ్ చద్దా, సునీల్ జాఖడ్, తరుణ్ చుగ్ పేర్లు వినిపిస్తున్నాయి.గత కొన్ని సంవత్సరాలుగా మణిపూర్ హింసాత్మక జ్వాలల్లో నలిగిపోతోంది. ఇక్కడ మైతేయి, కుకీ వర్గాల మధ్య జాతి సంఘర్షణలకు పెద్ద చరిత్రే ఉంది. ఈ అంశంపై ప్రతిపక్షాలు వీధుల నుంచి పార్లమెంట్ వరకు మోదీ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తున్నాయి. ఎన్నికల కంటే ముందే ఏ వర్గంలోనూ అసంతృప్తి తలెత్తకుండా ఉండేందుకు, ఇక్కడి వివిధ వర్గాల నాయకులకు కేబినెట్ లేదా పార్టీ సంస్థాగత పదవుల్లో చోటు కల్పించి సమతుల్యతను సాధించాలని బీజేపీ భావిస్తోంది.

# 24 గంటల్లో 300 మి.మీ. వర్షపాతం!

ముంబై, జూన్ 25, (న్యూస్ పల్స్)దేశంలోని పలు రాష్ట్రాలను భారీ వర్షాలు, వరదలు వణికిస్తున్నాయి. అటు ఈశాన్య రాష్ట్రం అరుణాచల్ ప్రదేశ్‌ను హఠాత్తుగా వచ్చిన వరదలు ముంచెత్తగా.. ఇటు దేశ ఆర్థిక రాజధాని ముంబైని రికార్డు స్థాయి వర్షపాతం అతలాకుతలం చేస్తోంది. కొండచరియలు విరిగిపడటం, నదులు ఉప్పొంగడంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులు, వంతెనలు కొట్టుకుపోవడంతో ప్రజాజీవనం పూర్తిగా స్తంభించిపోయింది.అరుణాచల్ ప్రదేశ్‌లో కురిసిన అతిభారీ వర్షాలు ఊహించని జలప్రళయాన్ని సృష్టించాయి.



ముఖ్యంగా కేయీ పన్యోర్, లోయర్ సుబన్‌సిరి జిల్లాలపై ఈ వర్షాల ప్రభావం తీవ్రంగా ఉంది. ఈ ప్రాంతాల్లో భారీగా కొండచరియలు విరిగిపడటంతో పాటు ఒక్కసారిగా ఫ్లాష్ ఫ్లడ్స్ సంభవించాయి. యాజలి, పోసా, యీయీ వంటి గ్రామాలు పూర్తిగా వరద నీటిలో మునిగిపోయాయి. వందలాది ఇళ్లు, వేల ఎకరాల్లో సాగు చేసిన వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పోసాలోని కాలనీలో సుమారు 15 నివాస గృహాలు వరద ఉద్ధృతికి పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఓ ప్రధాన రహదారి వంతెన వరద నీటిలో కొట్టుకుపోవడంతో పలు ప్రాంతాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.తక్కువ సమయంలోనే అత్యంత భారీ వర్షపాతం నమోదు కావడం వల్ల నదులలో నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి ఈ ఘోర పరిస్థితి తలెత్తిందని అధికారులు చెబుతున్నారు. ఈ వరదల ధాటికి పలువురు స్థానికులు గల్లంతైనట్లు సమాచారం అందుతోంది. సహాయక బృందాలు రంగంలోకి దిగి బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తూ సహాయక చర్యలను ముమ్మరం చేశాయి.అరుణాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న ఈ భారీ వర్షాల ప్రభావం దిగువన ఉన్న అసోం రాష్ట్రంపై పడే అవకాశం ఉంది. అరుణాచల్ నదుల నుంచి వచ్చే వరద నీటి వల్ల అసోంలోనూ వరద ముప్పు పొంచి ఉండటంతో అక్కడి ప్రభుత్వం తీవ్ర అప్రమత్తత ప్రకటించింది. ప్రజలు ఎవరూ నదీ తీర ప్రాంతాలకు వెళ్లవద్దని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలు జారీ చేసింది.మరోవైపు, దేశ ఆర్థిక రాజధాని ముంబైని సైతం భారీ వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నవీ ముంబైతో పాటు నగరంలోని పలు కీలక ప్రాంతాలు చెరువులను తలపిస్తున్నాయి. ప్రసిద్ధ దాదర్ స్టేషన్‌లో రైలు పట్టాలపై భారీగా నీరు నిలిచిపోవడంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బస్టాండ్‌లు, ప్రధాన కూడళ్లు నీట మునిగాయి. అనేక చోట్ల రహదారులపై మోకాళ్ల లోతు వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ మైళ్ల మేర నిలిచిపోయింది. గడిచిన 24 గంటల్లోనే నగరంలో ఏకంగా 300 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (ఃఓఅ) వెల్లడించింది.ముంబైలోని పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రాబోయే మరో రెండు రోజుల పాటు నగరంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని, మున్సిపల్ అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ సహాయక చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.


# ఎవరీ అనంతపురం జగన్?..

హైదరాబాద్, జూన్ 25 (న్యూస్ పల్స్) బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి గురించి అనంతపురానికి చెందిన స్వప్న మాట్లాడిన వీడియో వైరల్ అవుతోంది. ఆమె తన ప్రసంగంలో జగన్ సార్ అంటూ ఓ పేరును ప్రస్తావించారు. అందరూ మాజీ సీఎం జగన్ గురించి అనుకుని పొరపడ్డారు.. కానీ ఆమె ప్రస్తావించింది అనంతపురం జగన్ పేరు. అసలు ఇంతకీ ఎవరీ అనంతపురం జగన్.. నందమూరి బాలయ్యకు ఎందుకంత దగ్గరయ్యారు.తెలుగు రాష్ట్రాల్లో క్యాన్సర్ బాధితులకు 25 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్న బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎంతోమంది నిరుపేదలు ఈ ఆస్పత్రిలో చికిత్సపొంది ప్రాణాంతక క్యాన్సర్‌ను జయించారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో నిర్వహించిన రజతోత్సవ వేడుకల్లో క్యాన్సర్‌ను జయించిన కొందరు తమ అనుభవాలను పంచుకున్నారు. ఇది ఆస్పత్రి కాదు, ఓ దేవాలయం, పునర్జన్మ ప్రసాదించారంటూ ఎమోషనల్ అయ్యారు. అనంతపురానికి చెందిన స్వప్న అనే యువతి క్యాన్సర్ నుంచి ఎలా బయటపడ్డారో చెబుతూ చేసిన ప్రసంగం వైరల్ అవుతోంది. ఆ యువతి బసవతారకం ఆస్పత్రిలో చికిత్సపొందడానికి సాయం చేసినవారి పేరు చెబుతూ జగన్ సార్ అంటూ ప్రస్తావించారు. స్వప్న జగన్ పేరు ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో ఆ వీడియో వైరల్ అయ్యింది. ఆ యువతి చెప్పింది మాజీ సీఎం జగన్ గురించి అనుకుని కొంతమంది వైఎస్సార్‌సీపీ అభిమానులు పొరపాటుపడ్డారు. కానీ ఆమె అక్కడ ప్రస్తావించింది మాత్రం అనంతపురం జగన్ అలియాస్ జగదీష్ పేరు.. నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని, అత్యంత నమ్మకస్తుడు.సోషల్ మీడియాలో బాలయ్య వీరాభిమాని అనంతపురం జగన్ పేరు వైరల్ కావడంతో సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఇంతకీ ఎవరీ జగన్.. బాలయ్యకు ఎలా అంత దగ్గరయ్యారని ఆరా తీస్తున్నారు. ఆయన అసలు పేరు జగదీష్ అలియాస్ అనంతపురం జగన్.. నందమూరి బాలకృష్ణకు వీరాభిమాని. కేవలం అభిమాని మాత్రమే కాదు.. బాలయ్యపై అభిమానంతో 'ఔఃఐ ఊవశ్రీజూతినిణ ఊజీనిటబ' పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు, పేదలకు సహాయం చేస్తున్నారు. బాలకృష్ణ స్ఫూర్తితో ఎన్‌బీకే హెల్పింగ్ హ్యాండ్స్‌ను ఏర్పాట్లు చేసినట్లు జగన్ చెబుతుంటారు. తన తండ్రి 2004లో చనిపోయారని.. ఆ స్థానంలో బాలయ్య తన కుటుంబానికి అండగా ఉన్నారని జగన్ ఎన్నో సందర్భాల్లో చెప్పారు. నందమూరి బాలయ్య ఏ ఈవెంట్‌కు వెళ్లినా, ఏ కార్యక్రమానికి హాజరైనా వెంట అనంతపురం జగన్ ఉంటారు. ఎన్నో సందర్భాల్లో బాలయ్య జగన్ పేరును ప్రస్తావించారు. ప్రతి ఏటా బాలయ్య పుట్టినరోజును ప్రత్యేకంగా నిర్వహిస్తారు.. ప్రత్యేకంగా పాటలు (సిగ్నేచర్ సాంగ్స్) రూపొందించి విడుదల చేస్తుంటారు. ఆయన ఈ నెల 10న బాలయ్య పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. 'భోళా బాలయ్య' అంటూ ప్రత్యేంగా ఓ పాటను తీసి విడుదల చేశారు. జూన్ 1 నుంచి 10 వరకు వేడుకల్ని నిర్వహించి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతపురం జగన్‌కు బాలయ్య అభిమానుల్లో కూడా మంచి ఫాలోయింగ్ ఉంది.బాలయ్యకు ఫ్యాన్స్ ఉండరు.. భక్తులు ఉంటారని చెబుతుంటారు అనంతపురం జగన్. ఆయన స్ఫూర్తితో అనంతపురం జగన్ ఎంతోమంది బాలకృష్ణ అభిమానులకు సాయం చేశారు.. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతపురానికి చెందిన స్వప్నకు కూడా జగన్ సాయం చేశారు. స్వప్న పదోతరగతి చదువుతున్నప్పుడు బోన్ క్యాన్సర్ బయటపడింది. ఆమెను ఎన్నో ఆస్పత్రులకు తీసుకెళ్లారు.. కానీ ఆమె కోలుకోలేదు. అప్పుడు అనంతపురం జగన్‌కు విషయం తెలిసింది.. స్వప్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. బాలయ్యకు స్వప్న పరిస్థితి గురించి చెప్పి బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రిలో చేర్పించారు. నందమూరి బాలకృష్ణ స్వప్నకు అందించిన వైద్య చికిత్సను స్వయంగా పర్యవేక్షించారు. ఆమె క్యాన్సర్ జయించారు.. తనకు పునర్జన్మ ప్రసాదించిన బసవతారకం ఆసుపత్రికి, నందమూరి బాలకృష్ణకు, అనంతపురం జగన్‌కు స్వప్న ధన్యవాదాలు తెలిపారు.

### తెలంగాణ కాలనీలో నాలుగు హత్యల కేసులో వీడిన మిస్టరి

నల్గొండ,మృతురాలు హసీనా సొంత కూతురు–అల్లుడే హత్యలు చేయించినట్టు పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సొంత కూతురుకు ఆస్తి దక్కడం లేదని కారణం తోనే హత్యలు జరిగాయి. ల్లగొండ జిల్లా కేంద్రం సాగర్ రోడ్డు తెలంగాణ కాలనీలో ఒకే కుటుంబానికి చెందిన మహమ్మద్ సుల్తాన్ (45), ఆయన భార్య హసీన (40), కుమారుడు ముజమిల్(20), కుమార్తె అక్సర (11) అనుమానాస్పద మృతి కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి హైదరాబాద్ పాతబస్తీకి చెందిన నలుగురు రౌడీ షీటర్ల చేత అల్లుడు, కూతురు హత్య చేయించారు. హసీనాకు గతంలో రెండు పెళ్లిళు జరగగా.. నల్లగొండకు చెందిన మహ్మద్ సుల్తాన్ను మూడో వివాహం చేసుకుంది. సుల్తాన్కు కూడా గతంలో రెండు పెళ్లిళ్లు జరగగా.. సుల్తాన్ మొదటి భార్య పిల్లలు మహ్మద్ ముజమిల్, అక్సరతో కలిసి నల్లగొండలో హసీన కాపురం వుంటోంది.

# మొక్కజొన్న రికార్డ్ ధర....



వరంగల్, జూన్ 25 వరంగల్‌లోని ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం మొక్కజొన్న పంటకు రికార్డు స్థాయిలో క్వింటాకు రూ.2310 ధర లభించింది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు సమానంగా ప్రైవేటు వ్యాపారులు ఈ స్థాయిలో ధర పలకడం ఇదే తొలిసారి అని మార్కెట్ అధికారులు తెలిపారు. పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్ తన రెండెకరాల్లో పండించిన 72 క్వింటాళ్ల మొక్కజొన్నను ఈ ధరకు విక్రయించి భారీ లాభాలు గడించారు. ప్రభుత్వ మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో కొనుగోళ్ల జాప్యం కారణంగా పంటను ఇంట్లోనే నిల్వ ఉంచిన రైతుకు.. ఓపెన్ మార్కెట్లో ఈ ఊహించని భారీ ధర లభించడంతో హర్షం వ్యక్తమవుతోంది.ఆసియాలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటిగా పేరుగాంచిన వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సరికొత్త రికార్డు నమోదైంది. మంగళవారం జరిగిన పంట కొనుగోళ్లలో మొక్కజొన్న పంటకు మార్కెట్ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అత్యధిక ధర లభించింది. ప్రైవేటు వ్యాపారులు పోటీ పడి మరీ క్వింటా మొక్కజొన్నకు గరిష్ఠంగా రూ.2,310 ధర చెల్లించి కొనుగోలు చేశారు. ఓపెన్ మార్కెట్లో ఇంత భారీ మొత్తంలో ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సాధారణంగా వచ్చే ధరల కంటే ఇది చాలా ఎక్కువ కావడం విశేషం.జిల్లాలోని పర్వతగిరి మండలం చింతనెక్కొండ గ్రామానికి చెందిన రైతు మామిండ్ల దేవేందర్‌కు ఈ రికార్డు ధర దక్కింది. ఆయన తనకున్న రెండెకరాల భూమిలో రూ.50 వేల పెట్టుబడితో మొక్కజొన్న సాగు చేశారు. వాతావరణం అనుకూలించడంతో పాటు సరైన యాజమాన్య పద్ధతులు పాటించడంతో రైతుకు ఎకరాకు ఆశించిన దానికంటే మంచి దిగుబడి వచ్చింది. మొత్తం రెండెకరాల నుంచి 72 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి సాధించారు. ఈ పంట సరుకును మంగళవారం ఎనుమాముల మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడి ప్రైవేటు వ్యాపారులు నాణ్యతను పరిశీలించి క్వింటాకు రూ.2,310 చొప్పున మొత్తం పంటను కొనుగోలు చేశారు. పెట్టుబడితో పోలిస్తే రైతు దేవేందర్‌కు ఊహించని రీతిలో భారీ లాభం చేకూరింది.నిజానికి, ప్రభుత్వం ప్రకటించిన మొక్కజొన్న మద్దతు ధర క్వింటాకు రూ.2,400 గా ఉంది. అయితే ప్రభుత్వ సంస్థ అయిన మార్క్‌ఫెడ్ ఏర్పాటు చేసిన అధికారిక కొనుగోలు కేంద్రాల్లో సరుకు సేకరణ ప్రక్రియ తీవ్ర జాప్యంగా సాగుతోంది. టెక్నికల్ సమస్యలు, ఇతర కారణాల వల్ల కొనుగోళ్లు ఆలస్యం అవుతుండటంతో రైతు దేవేందర్ ఇంతకాలం తన పంటను ఇంట్లోనే నిల్వ చేసుకున్నారు. మార్కెట్లో డిమాండ్ పెరిగే వరకు వేచి చూశారు. ప్రభుత్వ కేంద్రాల ఆలస్యం కారణంగానే పంటను ఇంట్లో దాచుకోవాల్సి వచ్చిందని,.. ఏకానీ ఇప్పుడు ఓపెన్ మార్కెట్లోనే మద్దతు ధరకు కేవలం 90 రూపాయల తక్కువతో మంచి ధర రావడం చాలా సంతోషంగా ఉందని సదరు రైతు వెల్లడించారు.ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కు అత్యంత సమీపంగా ప్రైవేటు వ్యాపారులు రూ.2,310 లు వెచ్చించి మొక్కజొన్నను కొనుగోలు చేయడం ఇదే తొలిసారని ఎనుమాముల మార్కెట్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. సాధారణంగా మార్కెట్ సీజన్ ప్రారంభంలో వ్యాపారులు తక్కువ ధరలకే కొనుగోలు చేస్తుంటారని కానీ ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, నాణ్యమైన దిగుబడి కారణంగానే ఈ రికార్డు ధర సాధ్యమైందని వివరించారు.

# పవన్ కత్తి లేకుండా వచ్చే ఎన్నికల్లో యుద్ధానికి దిగుతున్నారా?



విజయవాడ, జూన్ 25 జనసేన అధినేత పవన్ కల్యాణ్ వద్ద అస్త్రాలన్నీ దాదాపుగా ఇప్పటికే వాడేశారు. వచ్చే ఎన్నికల్లో ఇక వాడేందుకు ఎలాంటి అస్త్రాలు ఆయన వద్ద లేదు. వచ్చే ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్లి ఏం చెప్పగలుగుతారన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతం వేరు. ప్రస్తుతం వేరు. భవిష్యత్ మరొలా ఉంటుంది. గత మూడు ఎన్నికల్లో తాను అధికారంలో లేకపోవడంతో ప్రజల వద్దకు వెళ్లి చెప్పేందుకు తగిన అంశాలున్నాయి. కానీ ఈసారి మాత్రం ఆయన అన్ని ఆయుధాలను వాడేశారు. మిగిలింది తమకు మరోసారి అధికారం ఇస్తే అభివృద్ధి సంక్షేమం అందిస్తామని మాత్రమే చెప్పగలిగేందుకు అవకాశముంటుంది.. 2014లో జనసేన పార్టీ పెట్టిన పవన్ కల్యాణ్ నాడు పోటీ చేయలేదు. నాడు టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతు ఇచ్చారు. అనుభవమున్న నేతతో పాటు, నాడు మోదీ చరిష్మా పట్ల ఆకర్షితుడైన పవన్ కల్యాణ్ వారికి మద్దతు పలికారు. 2019 ఎన్నికలకు వచ్చే సరికి టీడీపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. మరొక కూటమిని ఏర్పాటు చేసుకుని బీజేపీ, టీడీపీలపై విమర్శలు చేశారు. కానీ నాడు పవన్ కల్యాణ్ పోటీ చేసిన రెండు స్థానాలలోనూ ఓటమి చెందారు. జనసేన ఒకే ఒక స్థానం నుంచి గెలిచింది. 2024 ఎన్నికలకు వచ్చే సరికి చంద్రబాబు అరెస్ట్... టీడీపీ, బీజేపీతో జనసేన జట్టుకట్టడంతో కొంత ఆయుధాలు పుష్టిగా పవన్ కు లభించాయి. 2019 నుంచి వైసీపీ అధికారంలో ఉండటంతో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. 30 వేల మంది యువతులు మాయం అయ్యారని, లా అండ్ ఆర్డర్ దెబ్బతినిందని, అభివృద్ధి ఆగిపోయిందని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేవంటూ జనంలోకి వెళ్లగలిగారు. తాము అధికారంలోకి వస్తే యువతతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇస్తామని బహిరంగ సభల్లో చెప్పేందుకు వీలు కలిగింది. అయితే వచ్చే ఎన్నికల్లో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని మాత్రమే పవన్ కల్యాణ్ చెప్పగలరు. మరొక పార్టీని అధికారంలోకి రానివ్వవద్దని చెప్పడానికి పవన్ కల్యాణ్ వద్ద ఎటువంటి ఆయుధాలు లేవు. దీంతో పవన్ కల్యాణ్ ఆయుధాలు లేకుండా యుద్ధానికి దిగాల్సి వస్తుందన్న పరిస్థితి వస్తుంది. మరి వచ్చే ఎన్నికల్లో ప్రజలు, కాపు సామాజికవర్గం, అభిమానులు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ చాలా మంది నేతలు సంతోషంగా లేరు. గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు మూడుసార్లు అధికారంలో ఉన్నప్పటి పరిస్థితికి చాలా తేడా వచ్చిందంటున్నారు. పార్టీ నాయకత్వ వైఖరి మారడమే కాకుండా, పార్టీ కేంద్ర కార్యాలయం ఇస్తున్న నివేదికలపైనే చంద్రబాబు ఎక్కువ ఆధారపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయం నుంచి ఇచ్చే ఫీడ్ బ్యాక్ ను చూసి నాయకత్వం నిర్ణయాలు తీసుకంటుందన్న ఆరోపణలు సోషల్ మీడియాలోవెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు, గంగాధర నెల్లూరు నియోకవర్గ ఎమ్మెల్యేలు బహిరంగంగానే దీనిపై ఆరోపణలు చేయడం విశేషం. ఇవే ఆరోపణలు అనేక మంది నేతలు ఆఫ్ ది రికార్డుగా చేస్తున్నారు. గతంలో చంద్రబాబు నాయుడు సామర్థ్యం, అనుభవంపై నేతలకు నమ్మకం ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం చంద్రబాబు ఇతర పార్టీల పై ఆధారపడుతుండటంతో కొంత నేతలు ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కుతుందో? లేదో? అన్న టెన్షన్ కూడా వారిలో ఉంది. మిత్రపక్షాలు వత్తిడి తెస్తే ఏ నియోజకవర్గాన్ని అయినా వారికి అప్పగించేందుకు సిద్ధంగా ఉండేలా చంద్రబాబు వ్యవహార శైలి ఉందని నేతలు అభిప్రాయపడుతున్నారు. అందుకే గతంలో మాదిరిగా ప్రభుత్వంపై వస్తున్న విమర్శలను తిప్పికొట్టడంలో నేతలు ముందుకు రావడం లేదు. ప్రధాన రీజన్ ఇక పార్టీలో తమకు ప్రాధాన్యత ఉంటుందో లేదో అన్న అనుమానమే వారిని సైలెంట్ గా మార్చేసిందంటున్నారు. మరొకవైపు చంద్రబాబు వ్యూహంపై అనేక మంది కార్యకర్తలు, నేతలకు నమ్మకం మాత్రం సడలలేదు. చంద్రబాబు అనేక సార్లు పార్టీ ఓటమి పాలయినా తిరిగి అధికారంలోకి వచ్చేలా చేయగలడంలో సక్సెస్ అయిన తీరును చూసి నేతలు నమ్మకంతో ఉన్నారు. అలాంటి వారికి కూడా ఇటీవల జరుగుతున్న పరిణామాలు ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ 175 నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్, ఓటు బ్యాంకు ఉంది. అలాంటి సమయంలో గెలుపోటములపై ఆధారపడకుండా పార్టీ నియోజకవర్గాల్లో బలహీన పడకుండా చేయాల్సిన బాధ్యత కూడా చంద్రబాబుపైనే ఉంది. మరి రానున్న కాలంలో భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న బెంగ మాత్రం తెలుగు తమ్ముళ్లలో ఆందోళనను రేపుతుంది.

# జగన్ వర్సెస్ విజయ్ వర్సెస్ శివకుమార్





విజయవాడ, జూన్ 25 ఏమిటిది సినిమా టైటిల్ గా ఉందని అనుకోమాకండి. రాజకీయాల్లో ట్విస్టులు అలాగే ఉంటాయి మరి. తెర ముందు కొన్ని జరిగితే తెర వెనక జరగాల్సినవి ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. ఇదిలా ఉంటే దక్షిణాదిన తమ రాజకీయ ఆధిపత్యాన్ని పూర్తి స్థాయిలో చూపించాలని కాంగ్రెస్ నాయకత్వంలోని ఇండియా కూటమి ఆరాటపడుతోంది. ఉత్తరాదిలో బీజేపీ హవా తగ్గుతూండడంతో దక్షిణాదిని పూర్తిగా తమ సొంతం చేసుకుని ఉత్తరాది మీద కూడా పట్టు సాధించాలని ఇండియా బ్లాక్ అయితే వ్యూహ రచన చేస్తోంది. ఈ క్రమంలో ఏపీ వైపు ఫుల్ ఫోకస్ పెడుతున్నారు అని అంటున్నారు. ఏపీలో చూస్తే రాజకీయం పూర్తి స్పష్టతగా ఉంది. బీజేపీతో జనసేన టీడీపీ కలసి ప్రయాణం చేస్తున్నాయి. 2029 ఎన్నికల్లోనూ మూడు పార్టీలు ఎన్డీయే కూటమిగానే వస్తాయని అంటున్నారు. ఈ విషయంలో బీజేపీ కూడా జాగ్రత్తగానే ఉంటుంది. టీడీపీ అలాగే జనసేన 2019 నాటి అనుభవాలను దృష్టిలో ఉంచుకుని కూటమిని బలోపేతం చేసే విధంగానే వ్యవహరిస్తున్నాయి. దీంతో ఏపీలో ఇండియా కూటమి పాగా వేయాలి అంటే జగన్ తో చెలిమి అనివార్యంగా కనిపిస్తోంది అన్న విశ్లేషణలు ఉన్నాయి. కాంగ్రెస్ ఏ మాత్రం పుంజుకోకపోవడం వామపక్షాలు నామమాత్రం కావడంతో వైసీపీనే తిప్పుకోవాలని ఇండియా బ్లాక్ నేతలు చూస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉంటే సడెన్ గా దక్షిణాదిన పరిణామాలు రాజకీయంగా వేగంగా మారిపోతున్నాయి. కర్ణాటకకు ట్రబుల్ షూటర్ డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా వచ్చారు. ఆయనకు ఏకంగా వైఎస్సార్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అంతే కాదు జగన్ తోనూ మంచి పరిచయాలు ఉన్నాయని చెబుతున్నారు. జగన్ ప్రస్తుతం ఉంటోంది కూడా బెంగళూరులోనే అన్నది కూడా గుర్తుంచుకోవాలని చెబుతున్నారు. ఇక తమిళనాడుకు కొత్తగా ముఖ్యమంత్రి అయిన విజయ్ తోనూ జగన్ గుడ్ రిలేషన్స్ మెయిన్ టెయిన్ చేస్తున్నారు. తాజాగా జూన్ 22న విజయ్ బర్త్ డే వస్తే జగన్ గ్రీట్ చేస్తూ ఎక్స్ ఖాతా ద్వారా ట్వీట్ చేశారు. అంతకు ముందు కూడా చెన్నైలో ఒక వివాహ వేడుకలో ఇద్దరూ కలుసుకుని ముచ్చటించుకున్నారు. అంతే కాదు విజయ్ గెలిచాక జగన్ ఆయనకు అభినందనలు తెలిపారు. విజయ్ వైపు నుంచి కూడా అదే విధమైన రెస్పాన్స్ వస్తోంది అని అంటున్నారు. దీంతో ఏపీలో రాజకీయ పరిణామాలు ఏమైనా జరగవచ్చు అని అంటున్నారు. 2029 ఎన్నికల నాటికి ఇండియా కూటమిలోకి జగన్ ని తీసుకుని వచ్చేలా అటు డీకే శివకుమార్ ఇటు విజయ్ కూడా తమదైన శైలిలో తీవ్ర ప్రయత్నం చేస్తారు అని అంటున్నారు. జగన్ కి వీరు సన్నిహితులు కావడంతో ఆ వైపు నుంచి కూడా పాజిటివ్ గా రెస్పాన్స్ ఉండొచ్చు అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఇపుడే తొందరపడకుండా తగిన సమయంలోనే ఏపీ వ్యూహానికి ఒక లాజికల్ ఎండ్ తీసుకుని రావాలని అనుకుంటున్నారు అని చెబుతున్నారు. ఇక 2029 ఎన్నికల నాటికి ఎన్డీయే కూటమి గ్రాఫ్ బాగా తగ్గుతుందని ఇండియా బ్లాక్ నేతలు అంచనా వేస్తున్నారు. సౌత్ పార్ట్ అంతా తమ ప్యాకెట్ లో వేసుకుంటే నార్త్ లో కూడా సగానికి సగం అయినా సీట్లు గుంజుకుంటే కేంద్రంలో ఈజీగా ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు అన్నది ఇండియా బ్లాక్ పక్కా ప్లాన్ గా ఉంది. దానికి ఏపీ ఇపుడు అతి పెద్ద కీలకమైన పరిణామం కాబోతోంది అని అంటున్నారు.

# జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు

కాకినాడ జూన్ 25 పిఠాపురం ఎమ్మెల్యే గారి తాలూకా అని 2024 ఎన్నికల ముందూ తరువాత ఏపీ అంతా ఊగేలా స్లోగన్స్ చేసింది జనసైన్యం. పిఠాపురం అలా ఏపీ ఆంతా హాట్ టాపిక్ తొలిసారి అయింది. ఆ క్రెడిట్ కచ్చితంగా పవన్ కళ్యాణ్ దే. ఎందుకంటే ఆయన వెండితెర మీద పవర్ స్టార్. ఆయన ఫాలోయింగ్ అన్నది ఊహాతీతం. ఆయన క్రేజ్ అన్నది అద్భుతం. అందుకే పిఠాపురం అన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గం టాక్ ఆఫ్ ది స్టేట్ అయింది. అది పవన్ అక్కడ నుంచి పోటీ చేయాలని ఎంచుకుని నిలిచి గెలిచిన తరువాత జరిగిన డెవలప్మెంట్స్ గానే వీటిని చూడాల్సి ఉంది.పిఠాపురం నుంచి పవన్ పోటీ చేసి గెలిచారు. ఆయన ఆ తరువాత ఉప ముఖ్యమంత్రి అయ్యారు. ఇక రెండేళ్ళ కూటమి పాలనలో కాపులకు న్యాయం జరగడం లేదని వైసీపీ కాపులంతా ఒక చోట చేరి మీటింగ్ పెట్టారు. అది కోనసీమ జిల్లా వేదికగా జరిగింది. ఈ మీటింగ్ తరువాత రాజకీయ ప్రకంపనలు ఒక రేంజిలో సాగుతున్నాయి. జనసేన కాపులు వర్సెస్ వైసీపీ కాపులు అన్నట్లుగా రాజకీయం రంజుగా సాగుతోంది. ఈ మీటింగ్ తరువాత వైసీపీ నాయకురాలు వంగా గీత మీడియాతో మాట్లాడుతూ ఒక కామెంట్ చేశారు. పవన్ కులాన్ని తక్కువ చేయకూడదని అన్నారు. కాపులు ఎక్కువగా ఉన్నారనే కదా పిఠాపురం ఎంచుకుని పోటీ చేశారు అని ఆమె కామెంట్స్ చేశారు. అదే ఇపుడు ఏపీలో రాజకీయ పొలికేక గా మారిపోయింది. మరో వైపు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే జనసేన నేత పంతం నానాజీ అయితే హాట్ కామెంట్స్ చేశారు. పవన్ పిఠాపురం నుంచి పోటీ చేస్తే తప్పేంటి అన్నారు. వంగా గీతది పిఠాపురం అమ్మ గారి ఊరా నాన్న గారి ఊరా అని ప్రశ్నించారు. అసలు ఎవరు ఎక్కడ నుంచి అయినా పోటీ చేయవచ్చు అని రాజ్యాంగంలో ఉందని అన్నారు. జగన్ పులివెందుల నుంచి బయటకు వచ్చి కాకినాడ రూరల్ నియోజకవర్గంలో పోటీ చేస్తే తమ సత్తా ఏమిటో చూపిస్తామని పంతం నానాజీ రాజకీయ పంతమే పూనారు. ఈ సందర్భంగా ఆయన ఆవేశంలో జగన్ మీద అనుచిత వ్యాఖ్యలే చేశారు.

# రోజా అరెస్ట్ తప్పదా...?

తిరుపతి, జూన్ 25వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి ఆర్కే రోజా అరెస్టు తప్పదా? ఆమెపై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన నివేదిక రెడీ అయిందా? ప్రభుత్వం కూడా చాలా సీరియస్‌గానే స్పందిస్తోందా? అంటే.. ఔననే సమాధానమే వినిపిస్తోంది. తాజాగా మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి స్పందిస్తూ.. రోజా సహా.. వైసీపీ హయాంలో శాప్ చైర్మన్‌గా వ్యవహరించిన బైరెడ్డి సిద్ధార్థరెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, వాటిపై విజిలెన్స్ విచారణ కూడా పూర్తయిందని.. త్వరలోనే నివేదిక వస్తుందని తెలిపారు.వైసీపీ హయాంలో రోజా.. క్రీడల శాఖ మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని అమలు చేశారు. ఈ క్రమంలో సుమారు 150 కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్రికెట్, వాలీబాల్, హాకీ సహా ఇతర క్రీడలకు సంబంధించిన వస్తువులను బల్క్‌గా కొనుగోలు చేశారు. అయితే.. ఇవన్నీ నాశిరకమేనని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. క్రికెట్ స్టిక్స్ విరిగి పోవడం.. బ్యాట్లు ముక్కలు కావడం అప్పట్లో ప్రధానంగా కనిపించింది.అలానే.. రాష్ట్ర వ్యాప్తగా ప్లే గ్రౌండ్స్ ను ఆధునీకరించే పేరుతో పెద్ద ఎత్తున కాంట్రాక్టు పనులు చేయించారు. దీనికిగాను 100 కోట్ల రూపాయలను ఖర్చు చేశారు. అయితే.. ఈ



పనులు కూడా నాశిరకంగా సాగాయని అప్పట్లో క్రీడాకారులు ఆరోపించారు. ఆయా పరిణామాలపై కూటమి ప్రబుత్వం వచ్చిన తర్వాత అందిన ఫిర్యాదులతో విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ విచారణ పూర్తయి.. ప్రస్తుతం నివేదిక రూపొందిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు.క్రీడా పరికరాలు కొనుగోలు చేసే విషయంలోను.. మైదానాలను చదును చేసి మౌలిక సదుపాయాలు కల్పించే పేరిట మొత్తంగా 100 కోట్ల రూపాయల మేరకు అవినీతి జరిగిందని.. ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే విచారణకు ఆదేశించింది. ఈ నిధుల్లో రోజా, బైరెడ్డిలు సమానంగా పంచుకున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ నివేదిక వచ్చిన వెంటనే రోజా అరెస్టు ఖాయమని టీడీపీ వర్గాలు చర్చిస్తున్నాయి. కాగా.. రోజా దీనిపై స్పందించేందుకు నిరాకరించారు.

# బెబ్బులి దెబ్బ.. ఏలూరు జిల్లాలో హైటెన్షన్..!

ఏలూరు, జూన్ 25 జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా హల్‌చల్ చేస్తున్న పెద్దపులి తాజాగా బుట్టాయగూడెం మండలంలోకి ప్రవేశించింది. మండల పరిధిలోని నిమ్మలగూడెం శివారులో గల పాలకుంట చెరువు సమీపంలో పులి సంచరించినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పాలకుంట చెరువు వద్ద మేతకు వెళ్లిన పశువుల మందపై పెద్దపులి ఒక్కసారిగా దాడికి తెగబడింది. ఈ దాడిలో రెండు ఆవులు అక్కడికక్కడే మృతి చెందాయి.సమాచారం అందుకున్న అటవీ శాఖ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పులి అడుగు జాడలనుపరిశీలించారు. పశువుల మరణంతో స్థానిక రైతులు, గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పెద్దపులి సంచరిస్తున్న నేపథ్యంలో బుట్టాయగూడెం మండలం మరియు పరిసర గిరిజన గ్రామాల్లో అటవీ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. గ్రామాల్లో మైకుల ద్వారా అనౌన్స్‌మెంట్ చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.సమీపంలోని అటవీ ప్రాంతాలకు, పొలాలకు ఎవరూ ఒంటరిగా వెళ్లకూడదని, ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఇళ్ల నుంచి బయటకు రావద్దని గిరిజనులకు గట్టిగా సూచించారు. అయితే, ఈ పులి కదలికలను ట్రాక్ చేయడం అధికారులకు కొంత సులువైంది. ఈ పులికి ముందే 'రేడియో కాలర్' అమర్చి ఉండటంతో, శాటిలైట్ సిగ్నల్స్ ఆధారంగా అది ఎటు వైపు వెళ్తోంది అనే విషయాన్ని అటవీ శాఖ ప్రత్యేక బృందాలు నిరంతరం పర్యవేక్షిస్తున్నాయి. పులిని తిరిగి అడవిలోకి పంపించేందుకు లేదా పట్టుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు ఎవరూ అధైర్యపడకూడదని అధికారులు వెల్లడించారు.

# ఈ సారి కోలగట్ల శ్రావణి వంతేనా

విజయనగరం, జూన్ 25 విజయనగరం అంటేనే పూసపాటి వారి సంస్థానం. మూడు తరాలను చూసిన గడ్డ అది. రాచరికం అయినా ప్రజాస్వామ్యం అయినా పూసపాటి వారి హవాకు తిరుగులేదు. పీవీజీ రాజు నుంచి అశోక్ గజపతిరాజు దాకా అందరినీ విజయనగరం ప్రజలు ఆశీర్వదించారు. అశోక్ అయితే ఈ రోజున గోవాకు గవర్నర్ గా వెళ్లారు. ఆయన 1978 నుంచి 2009 దాకా ఏకంగా ఎనిమిది సార్లు పోటీ చేస్తే ఏడు సార్లు విజయనగరం అసెంబ్లీ నుంచి గెలిచి అనేకసార్లు మంత్రి పదవులు చేపట్టారు. ఇక కేంద్ర మంత్రిగా కూడా పనిచేసిన అశోక్ గవర్నర్ గా తన రాజకీయ జీవితాన్ని రాజ్యాంగబద్ధమైన పదవితో పూర్తి చేయనున్నారు అశోక్ కుమార్తెగా రాజకీయాల్లో వారసత్వంగా ముందుకు వచ్చిన అదితి గజపతి రాజు 2019లో ఓడి 2024లో గెలిచారు. 2019లో ఆమెను కోలగట్ల వీరభద్రస్వామి ఓడించారు. ఇక 2029లో అదితి గజపతి రాజు మీద పోటీ చేయబోయేది కోలగట్ల వారసురాలు అయిన శ్రావణి అని అంటున్నారు. తండ్రికి తగిన తనయగా ఆమె ఇప్పటికే పేరు తెచ్చుకున్నారు. విజయనగరం కార్పోరేషన్ కి డిప్యూటీ మేయర్ గా పనిచేసిన అనుభవం ఆమె సొంతం. దాంతో పాటుగా వైసీపీ పార్టీ కార్యక్రమాలలో ఆమె జోరుగా పాల్గొంటున్నారు. 2029 ఎన్నికల విషయంలో ఇప్పటి నుంచే కోలగట్ల శ్రావణి ప్రిపేర్ అవుతున్నారు: అశోక్ కుమార్తెగా రాజకీయాల్లోకి వచ్చినా తండ్రి మాదిరిగా జనంతో మమేకం కావడం లేదు అన్న విమర్శ అయితే అదితి గజపతిరాజుకు ఉందని అంటున్నారు. ఆమె కొద్ది మంది నేతల మీదనే ఆధారపడుతున్నారని అంటున్నారు. దాంతో పార్టీలోనూ కొంత అసంతృప్తి ఉందని చెబుతున్నారు. వీటిని ఆమె అధిగమించాల్సి ఉందని చెబుతున్నారు. రెండేళ్ళ పాలన అయితే పూర్తి అయింది, దాంతో ఇక మీదట గట్టిగా పట్టు బిగించాల్సి ఉందని చెబుతున్నారు. విజయనగరంలో వైసీపీకి కూడా పట్టు ఉంది. పైగా కోలగట్ల సామాజిక వర్గం కూడా అధికంగా ఉంది. దాంతో మాజీ ఉప సభాపతిగా ఉంటూ రెండు సార్లు ఎమ్మెల్యే ఒకసారి ఎమ్మెల్సీగా పనిచేసిన కోలగట్ల వీరభద్రస్వామి ఈసారి కుమార్తెని గెలిపించుకోవాలని పూర్వ రంగం సిద్ధం చేసుకుంటున్నారు.

# పెండింగ్ సమస్యలపై యుద్ధం

విశాఖపట్టణం, జూన్ 25 ఏపీ టీడీపీ ప్రెసిడెంట్, గాజువాక అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు గాజువాకలో పెండింగ్ భూ సమస్యల మీద పిటిషన్ కమిటీ ముందు గళమెత్తారు. చిరకాలంగా అటు రెవిన్యూ ఇటు ఏపీఐఐసీ, పట్టణాభివృద్ధి శాఖలకు సంబంధించిన అనేక భూ సమస్యలను కమిటీ ముందు ఉంచారు. ఈ సమస్యలకు రెండు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం. ఇదిలా ఉంటే విశాఖ కలెక్టర్ కార్యాలయంలో డిప్యూటీ స్పీకర్, శాసనసభ పిటిషన్స్ కమిటీ ఛైర్మన్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పిటిషన్స్ కమిటీ సమావేశంలో గాజువాక నియోజకవర్గం సమస్యల మీద పల్లా పూర్తి స్థాయిలో ప్రస్తావించారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతం. దాంతో భూములను వివిధ పరిశ్రమల కోసం సేకరించడం జరుగుతోంది. అదే సమయంలో భూ సేకరణకు తమ భూములు ఇచ్చిన బాధితులకు నష్ట పరిహారం ఈ రోజుకీ చాలా కేసులలో దక్కలేదు. అంతే కాదు, నిర్వాసితుల పునరావాసం సమస్య ఉండనే ఉంది. అలాగే 22-ఏ సమస్యలతో పాటు పరిశ్రమల వల్ల ప్రభావితమైన కుటుంబాల హక్కులు కూడా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ ఉంది. వీటిని అన్నింటికీ కమిటీ ముందు పల్లా ఉంచారు. ఇక చినగంట్యాడ పరిధిలో అనేక గ్రామాలలో నివస్తున్న వందలాది కుటుంబాలకు ఇప్పటికే ఉన్న ఇళ్లకు జీవో నంబర్ 30 తరహాలో క్రమబద్ధీకరణ కల్పించాలని పల్లా కోరారు. అంతే కాదు ఆ ఇళ్ళు రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పల్లా డిమాండ్ చేశారు. ఈ అంశంపై ప్రధాన కార్యదర్శికి ప్రత్యేక సిఫార్సులు పంపాలని పిటిషన్ కమిటీకి సూచించారు. అవసరమైతే కేబినెట్ ఆమోదంతో ప్రత్యేక విధానం తీసుకురావాలని కూడా పల్లా సూచించారు. దీనిపై పిటిషన్స్ కమిటీ సానుకూలంగా స్పందించడమే కాదు 90 రోజుల్లో కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించడం విశేషం. ఇక 22-ఏ పేరుతో అనేక భూములు చిక్కుకున్నాయని పల్లా పిటిషన్ కమిటీ ముందు ఉంచారు. అలా గాజువాకలోని వడ్లపూడి, చినగంట్యాడ, కూర్మన్నపాలెం, మిందీ, పెద్దగంట్యాడ, జగ్గరాజుపేట ప్రాంతాల్లోని నివాస కాలనీలు ఉండటంతో ప్రజలు కొనుగోలు, విక్రయాలు వంటివి లేకుండా పూర్తిగా ఇబ్బందిలో పడ్డారని ఆయన చెప్పారు. వీటిలఒ అర్హులైన నివాస ప్రాంతాలను 22-ఏ నుంచి తొలగించాలని పల్లా కమిటీని కోరారు. ఇక ఉక్కు నిర్వాసితుల ఆర్-కార్డుల డిజిటలైజేషన్ సమయంలో నకిలీ కార్డులు కూడా వచ్చాయని ఆయన చెప్పారు. దీంతో అనుమానాస్పదంగా ఉన్న 486 డౌట్‌ఫుల్ ఆర్-కార్డుల వ్యవహారాన్ని సమగ్రంగా పరిశీలించి అర్హులైన వారికి న్యాయం చెస్తామని కమిటీ హామీ ఇవ్వడం విశేషం

# అధిక రక్తపోటు (హైబీపీ) ఉన్నవారు ఉప్పు తీసుకోవడం తగ్గిస్తే చాలదు..




అధిక రక్తపోటుతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతుందని చెప్పవచ్చు. మారిన జీవనశైలే ఇందుకు ప్రధాన కారణం. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ ఈ సమస్య బారిన పడుతున్నారు. రక్తపోటు అనగానే ముందుగా అందరూ ఉప్పును తక్కువగా తీసుకోమని సూచిస్తూ ఉంటారు. రక్తపోటుతో బాధపడే వారు రోజూ 6 గ్రాముల కంటే తక్కువ ఉప్పును తీసుకోవాలని వైద్యులు చెబుతూ ఉంటారు. అయితే తాజా పరిశోధనలు ఉప్పును తక్కువగా తీసుకున్నంత మాత్రాన రక్తపోటు తగ్గదని పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్లే రక్తపోటు అదుపులో ఉంటుందని చెబుతున్నాయి.కెనడా పరిశోధకుల అధ్యయనం..

కెనడాలోని వాటర్‌లూ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఉప్పును తగ్గించడంపై మాత్రమే దృష్టి పెట్టడం కంటే పొటాషియం, సోడియం నిష్పత్తిని పెంచడం రక్తపోటు నియంత్రణకు మరింత ప్రభావవంతంగా ఉంటుందని సూచిస్తున్నారు. సాధారణంగా మనకు అధిక రక్తపోటు ఉన్నప్పుడు తక్కువ ఉప్పును తీసుకోవాలని సలహా ఇస్తారు. అయితే ఆహారంలో భాగంగా అరటిపండు, బ్రోకలీ వంటి పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తపోటు గణనీయంగా తగ్గుతుంది. పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకున్నప్పుడు ఉప్పును తగ్గించినప్పటి కంటే కూడా రక్తపోటు స్థాయిలు ఎక్కువ తగ్గుతాయని పరిశోధకులు చెబుతున్నారు.

పొటాషియం చేసే మేలు..ఆహారంలో అధిక ఉప్పు శరీరం నీటిని నిలుపుకునేలా చేస్తుంది. ఇది రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. చివరికి మూత్రపిండాలపై ఒత్తిడిని పెంచుతుంది. ఉప్పును తగ్గించడం ప్రయోజకరంగా ఉన్నప్పటికీ, పొటాషియం శరీరం నుండి అదనంగా ఉన్న సోడియంను బయటకు పంపడానికి, రక్తనాళాల గోడలను సడలించడానికి సహాయపడుతుంది. పొటాషియం, సోడియం రెండూ కూడా ఎలక్ట్రోలైట్లు. నరాల సిగ్నలింగ్, కండరాల సంకోచాలు, ద్రవ సమతుల్యత వంటి శారీరక విధులను ఇవి నిర్వర్తిస్తాయి. పరిశోధనల ప్రకారం పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల ఎలక్ట్రోలైట్ల సమతుల్యత పునరుద్ధించడంతో పాటు రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది.

ఈ ఆహారాలను తినాలి..మారిన ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజలు సోడియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకుంటున్నారు. దీంతో రక్తపోటుతో బాధపడే వారి సంఖ్య పెరుగుతోంది. అధిక రక్తపోటు కారణంగా గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. కనుక రక్తపోటుతో బాధపడే వారు ఉప్పును తక్కువగా తీసుకోవడంతో పాటు పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడానికి ప్రయత్నించాలి. భోజనంలో అరటిపండు, చిలగడదుంప, కాయధాన్యాలు, అవకాడో వంటి వాటిని తీసుకోవడం ప్రయోజనకరంగా ఉంటుంది. రక్తపోటుతో బాధపడే వారే కాకుండా ఆరోగ్యవంతమైన వ్యక్తులు కూడా పొటాషియం ఎక్కువగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల భవిష్యత్తులో రక్తపోటు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

# చక్కెర మన శరీరానికి ఎన్ని విధాలుగా చేటు చేస్తుందో తెలుసా..?

మనం ఆహారంలో భాగంగా చక్కెరను కూడా తీసుకుంటూ ఉంటాం. టీ, కాఫీ వంటి వాటితో పాటు తీపి వంటకాల తయారీలో కూడా చక్కెరను విరివిగా ఉపయోగిస్తూ ఉంటాం. చక్కెరతో చేసే తీపి వంటకాలు చాలా రుచిగా ఉంటాయి, వీటిని అందరూ ఎంతో ఇష్టంగా తింటూ ఉంటారు. అయితే చక్కెరను తీసుకోవడం వల్ల డయాబెటిస్ వంటి అనారోగ్య సమస్య ఒక్కటే వస్తుందని అందరూ భావిస్తూ ఉంటారు. కానీ చక్కెర మన శరీరంలో అన్ని అవయవాల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. దీర్ఘకాలిక ఆరోగ్యంపై చక్కెర తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. గుండె, కాలేయం, మెదడు, చర్మం ఇలా అన్ని అవయవాలపై చక్కెర చెడు ప్రభావాన్ని చూపుతుంది. అయితే ఈ లక్షణాలు మనకు వెంటనే కనిపించవు. కానీ కాలక్రమేణా మనం చక్కెర దుష్ప్రభావాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. చక్కెర మన శరీరంలో వివిధ అవయవాలపై ప్రభావాన్ని ఎలా చూపిస్తుందో ఇప్పుడు తెలుసుకుందాం.

క్యాన్సర్‌కు దారి తీస్తుంది..

మధుమేహానికి చక్కెర ఒకే ఒక కారణం కాకపోయినప్పటికి ప్రధాన కారణం అని చెప్పవచ్చు. అధిక చక్కెరను తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరుగుతాయి. ఇన్సులిన్ నిరోధకత పెరుగుతుంది. దీని వల్ల మధుమేహాన్ని నిర్వహించడం చాలా కష్టంగా మారుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండడం వల్ల కళ్లు, మూత్రపిండాలు, నరాలు, గుండె ఆరోగ్యం దెబ్బతింటుంది. అదేవిధంగా చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుంది. దీర్ఘకాలం పాటు ఉండే ఊబకాయం క్యాన్సర్ కు కూడా దారి తీస్తుంది. అధిక చక్కెర తీసుకోవడం వల్ల 60 నుండి 95 శాతం క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా ఉన్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. కనుక చక్కెర తీసుకోవడం తగ్గించాలి. ఇక




చక్కెరను తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి.

లిపిడ్ ప్రొఫైల్..

రోజువారి చక్కెర పానీయాల వినియోగం లిపిడ్ ప్రొఫైల్ తో కూడా ముడిపడి ఉంటుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ ల ప్రమాదాన్ని పెంచుతుంది. మన శరీరంలో ఉండే కాలేయం చక్కెరలో ప్రధానమైన ఫ్రక్టోజ్ ను ప్రాసెస్ చేస్తుంది. అధికంగా చక్కెరను తీసుకోవడం వల్ల కాలేయ కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. ఇది ఫ్యాటీ లివర్ కు దారి తీస్తుంది, ఫైబ్రోసిస్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. చక్కెరను ఎక్కువగా తీసుకోవడం వల్ల శరీరంలోకి క్యాలరీలు ఎక్కువగా వచ్చి చేరతాయి, చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల కడుపు నిండిన భావన కూడా కలగదు. ఇది మనం అతిగా తినడాన్ని ప్రోత్సహిస్తుంది. అదనపు చక్కెర ఇన్సులిన్, లెప్టిన్ అనే హార్మోన్లకు కూడా అంతరాయాన్ని కలిగిస్తుంది. దీంతో శరీర బరువు పెరుగుతుంది. రక్తంలో చక్కెర పెరుగుదల, క్రాష్ లు న్యూరోట్రాన్స్ మిటర్ లను ప్రభావితం చేస్తుంది, మెదడులో వాపును పెంచుతుంది. తద్వారా మానసిక సమస్యలు తలెత్తే అవకాశం కూడా ఉంది.

మెదడు ఆరోగ్యం..

చక్కెర తీసుకోవడం వల్ల మెదడు ఆరోగ్యం దెబ్బతింటుంది. ఇది జ్ఞాపకశక్తి తగ్గేలా కూడా చేస్తుంది. చక్కెర ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల మెదడు క్షీణత వేగవంతంగా జరుగుతుంది. అలాగే చక్కెరను అతిగా తీసుకోవడం వల్ల రక్తంలో గ్లూకోజ్ తో పాటు రక్తపోటు కూడా పెరుగుతుంది. ఇవి రెండూ కూడా మూత్రపిండాలపై తీవ్రప్రభావాన్ని చూపిస్తాయి. కాలక్రమేణా ఇది మూత్రపిండాల వైఫల్యానికి దారి తీస్తుంది. అతిగా చక్కెరను తీసుకోవడం వల్ల మొటిమలు, చర్మంపై మంట, వృద్ధాప్య ఛాయలు ఎక్కువగా వస్తాయి. దంతాల సమస్యలు కూడా పెరుగుతాయి. చిగుళ్ల సమస్యలతో పాటు దంతాలు పుచ్చిపోవడం వంటివి కూడా జరుగుతాయి. ఇలా చక్కెర మన శరీరంలో ఉండే అన్ని అవయవాలపై చెడు ప్రభావాన్ని చూపిస్తుందని వైద్యులు చెబుతున్నారు. కనుక చక్కెర, చక్కెర ఉండే ఆహారాలను, శీతల పానీయాలను తక్కువగా తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు.



# ఇంట్లోనే తాజా పనీర్




రుచిని పంచుతూ, ఆరోగ్యం పెంచే పదార్థం పనీర్. ఒక్క పనీర్‌తో రుచికరమైన వంటకాలెన్నో చేసుకోవచ్చు. పనీర్ వండుకుందామని అనుకోగానే.. మార్కెట్‌కు పరుగులు తీస్తుంటాం. అయితే మార్కెట్‌లో పనీర్ కల్తీ జోరుగా సాగుతున్నది. ఏదిపడితే అది తీసుకొచ్చి వండుకుంటే ఆరోగ్యానికి బదులు అనారోగ్యం పాలవ్వడం ఖాయం. అలాకాకుండా ఇంట్లోనే స్వచ్ఛమైన, మృదువైన పనీర్ తయారు చేసుకోవచ్చు. అదెలాగంటే.. మారెట్ స్టయిల్ పనీర్ కోసం ముందుగా పాన్‌లో కొంచెం నీరు పోయండి. అందులో 2 లీటర్ల ఫుల్ ఫ్యాట్ క్రీమ్ మిల్ పోసుకోండి. ఇప్పుడు పాలను స్టవ్ మీద ఉంచి ఎకువ మంట మీద మరిగించాలి. అప్పుడప్పుడూ చెంచాతో కలుపుతూ.. పాలు బాగా మరిగిన తర్వాత స్టవ్ ఆఫ్ చేయాలి.ఇప్పుడు పాలు విరగడానికి వెనిగర్, నీరు కలిపి మరిగిన పాలలో పోయాలి. ఇప్పుడు పాలు విరగడం మీరు గమనించవచ్చు. అది జున్నులా కనిపిస్తుంది. విరిగిన పాలలో కొద్దిపాటి చల్లటి నీళ్లు పోయాలి. ఇప్పుడు ఒక శుభ్రమైన కాటన్ వస్త్రంతో విరిగిన పాలను వడకట్టుకోవాలి. అలా మిగిలిన జున్నును వస్త్రంలోనే ఉంచి ఆ మూటపై కాస్త బరువు పెట్టి.. 30 నిమిషాల పాటు అలాగే పెట్టాలి. తర్వాత.. వస్త్రం నుంచి పనీర్‌ను తీసి, ముక్కలుగా కట్ చేసుకుంటే సరి. మీరు వండుకున్న తర్వాత మిగిలిన పనీర్‌ను ఒక పాత్రలో వేసి, అందులో నీళ్లు నింపి ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. వారం రోజులు ఫ్రెష్‌గా ఉంటుంది.

# మీకు నిరంతరం ఈ సంకేతాలు కనిపిస్తున్నాయా..?

## అయితే గుండె పోటు లక్షణాలు కావచ్చు జాగ్రత్త..!

ఏదైనా ఒక అనారోగ్య సమస్య వచ్చే ముందు మనకు కొన్నిలక్షణాలను చూపిస్తుంది. ఈ లక్షణాలు ముదిరే వరకు మనకు అనారోగ్య సమస్య ఉందనే తెలియదు. కొన్ని రకాల అనారోగ్య సమస్యలు అప్పటికప్పుడు వచ్చినా కొన్ని మాత్రం మనకు ముందు నుండే సంకేతాలను, లక్షణాలను కనబరుస్తూ ఉంటాయి. అలాంటి అనారోగ్య సమస్యల్లో గుండెపోటు ఒకటి. మన శరీరంలో ముఖ్యమైన అవయవాల్లో గుండె ఒకటి. హృదయ స్పందన ప్రతి ఒక్కరి జీవితానికి చాలా ముఖ్యమైనది. గుండెపోటు వచ్చే శరీరం నిరంతరం సంకేతాలను ఇస్తూనే ఉంటుంది. ఈ సంకేతాలను అర్థం చేసుకోకపోవడం వల్ల, నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్య తీవ్రమై కొందరు ప్రాణాలను కూడా విడుస్తున్నారు. వైద్యులు చెబుతున్న ప్రకారం గుండెపోటు రాకముందు శరీరం వివిధ సంకేతాలను ఇస్తుంది. ఈ సంకేతాలపై శ్రద్ధ వహించడం వల్ల మనం గుండెపోటు బారిన పడకుండా ఉండవచ్చు. అలాగే శరీర ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. గుండెపోటు వచ్చే ముందు మన శరీరం కనబరిచే లక్షణాల గురించి తెలుసుకుందాం.

ఛాతిలో ఒత్తిడిగా..



గుండెపోటు వచ్చే ముందు కొందరిలో ఛాతిలో ఒత్తిడిగా ఉంటుంది. దీనిని ఆంజినా అని కూడా పిలుస్తారు. ఈ సమయంలో ఊపిరాడకుండా ఉండడంతో పాటు ఆందోళనగా ఉంటుంది. గుండెకు రక్తప్రసరణ, ఆక్సిజన్ సరఫరా సరిగ్గా జరగనప్పుడు ఇలా జరుగుతుంది. తరచూ ఛాతిలో నొప్పి రావడం, ఒత్తిడి ఇలాగే కొనసాగడం వల్ల గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఆకస్మాత్తుగా తలతిరగడం, చలి చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే ఆహారం సరిగ్గా తీసుకున్నప్పటికీ నీరసంగా ఉంటుంది. ఇది కూడా గుండె సమస్యకు సంకేతం కావచ్చు. గుండెతో పాటు ఊపిరితిత్తులు కూడా రక్తప్రసరణ లోపం వల్ల ప్రభావితం అవుతాయి. రక్తప్రసరణ సాఫీగా సాగకపోవడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయి. శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం కూడా గుండెపోటు వచ్చే ముందు కనిపించే లక్షణాల్లో ఒకటి.

సరైన ఆహారాన్ని తీసుకోవాలి..

చక్కటి ఆహారాన్ని తీసుకున్నప్పటికి అలసటగా ఉంటుంది. గుండెకు రక్తప్రసరణ తక్కువగా ఉండడం వల్ల ఇలా జరుగుతుంది. ధమనుల్లో అడ్డంకులు ఏర్పడడం వల్ల కూడా ఇలా జరగవచ్చు. ఇక గుండెపోటు వచ్చే ముందు కనిపించే లక్షణాల్లో నిద్రలేమి కూడా ఒకటి. నిద్రలేమి ఇతర అనారోగ్య సమస్యలకు కూడా దారితీస్తుంది. కనుక నిద్రలేమి సమస్య తలెత్తిన వెంటనే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే అలస్యం చేయకుండా గుండె సంబంధిత వైద్యుడిని సంప్రదించాలి. ఎలక్ట్రో కార్డియోగ్రామ్, రక్తపరీక్షలు చేయించుకోవడం మంచిది. ఈ లక్షణాలు గుండెపోటు కారణంగా వచ్చాయా లేదా ఇతర అనారోగ్య సమస్యల కారణంగా వచ్చాయా అని నిర్ధారించుకోవాలి. ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి. పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం, తగినంత శారీరక శ్రమ ఉండేలా చూసుకోవడం చేయాలి. ఒత్తిడి, ధూమపానం, మద్యపానం వంటివి మానేయాలి. అలాగే జన్యుపరగంగా రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉంటే తరచూ పరీక్షలు చేయించుకోవడం మంచిది.

# రోజూ సపోటా పండ్లను తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే.. వీరు మాత్రం తినకూడదు..!

మన ఆరోగ్యానికి మేలు చేసే వివిధ రకాల పండ్లల్లో సపోటా పండు కూడా ఒకటి. ఈ పండు చాలా రుచిగా తియ్యగా ఉంటుంది. దీనిని పిల్లలు కూడా ఇష్టంగా తింటారని చెప్పవచ్చు. సపోటా పండులో మన శరీరానికి అవసరమయ్యే ఎన్నో రకాల పోషకాలు ఉన్నాయి. దీనిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. దీనిలో విటమిన్ ఎ, బి, సి, ఇ, క్యాల్షియం,ఫైబర్, మెగ్నీషియం, మాంగనీస్, పొటాషియం వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. సపోటాను ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. సపోటాలో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల మలబద్దకం సమస్య తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది.ఎముకల దృఢత్వానికి..సపోటాలో పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. రక్తప్రసరణను మెరుగుపరచడంలో, రక్తపోటును తగ్గించడంలో, చెడు కొలెస్ట్రాల్ ను తొలగించడంలో ఇవి ఎంతగానో సహాయపడతాయి. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సపోటా మనకు ఎంతో దోహదపడుతుంది. సపోటా పండ్లను తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ఇందులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. సపోటా పండ్లను తీసుకోవడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని ఇవ్వడంలో ఇవి మనకు ఎంతో సహాయపడతాయి. తరచూ అలసట, బలహీనతతో బాధపడే వారు సపోటాను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. సపోటాలో ఉండే క్యాల్షియం ఎముకలను దృఢంగా ఉంచడంలో ఉపయోగపడుతుంది.కళ్ల ఆరోగ్యానికి..కళ్ల ఆరోగ్యానికి, చర్మ ఆరోగ్యానికి కూడా సపోటా ఎంతో మేలు చేస్తుంది. ఇందులో ఉండే విటమిన్ ఇ చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడుతుంది. విటమిన్ ఎ కంటిచూపును మెరుగుపరచడంలో దోహదపడుతుంది. సపోటా పండును తీసుకోవడం వల్ల వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. ఇక రక్తహీనతతో బాధపడే వారికి సపోటా దివ్యఔషధంలా పని చేస్తుందని చెప్పవచ్చు. ఇందులో ఉండే ఐరన్ రక్తహీనతను తగ్గించడంలో ఎంతో సహాయపడుతుంది. పాలిచ్చే తల్లులు దీనిని తీసుకోవడం వల్ల వారిలో పాల ఉత్పత్తి కూడా పెరుగుతుంది.

# స్పోర్ట్స్ న్యూస్

## ఇంగ్లండ్‌తో మ్యాచ్.. అంపైర్ నిర్ణయంపై వెస్టిండీస్ కెప్టెన్ అసంతృప్తి




మహిళల టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 38 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. గ్రూప్-ఎ నుంచి ఇంగ్లండ్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ విజయం కంటే.. వెస్టిండీస్ కెప్టెన్ హెయిలీ మాథ్యూస్ ఔటైన తీరు, థర్డ్ అంపైర్ తీసుకున్న నిర్ణయం వివాదాస్పదంగా మారాయి. వెస్టిండీస్ ఇన్నింగ్స్ 4వ ఓవర్లో ఈ హైడ్రామా చోటుచేసుకుంది. ఇంగ్లండ్ బౌలర్ లిన్సే స్మిత్ వేసిన ఆఫ్ స్టంప్ వెలుపలికి బంతిని వేసింది. మాథ్యూస్ ఆ బంతిని కట్ చేయడానికి ప్రయత్నించగా.. అది వికెట్ కీపర్ అమీ జోన్స్ చేతుల్లో పడింది. ఇంగ్లండ్ ఆటగాళ్ల అప్పీల్ చేయగా ఆన్ ఫీల్డ్ అంపైర్ ఎన్. జనని నిరాకరించగా, ఇంగ్లండ్ రివ్యూ కోరింది. టీవీ రీప్లేలలో బ్యాట్‌కు, బంతికి మధ్య స్పష్టమైన గ్యాప్ ఉన్నట్లు దృశ్యాలు కనిపిస్తున్నప్పటికీ.. అల్ట్రాఎడ్జ్‌లో వచ్చిన ఒక చిన్న స్పైక్ ఆధారంగా థర్డ్ అంపైర్ నిమాలి పెరీరా మాథ్యూస్‌ను ఔట్‌గా ప్రకటించారు. ఈ నిర్ణయంపై వెస్టిండీస్ కెప్టెన్ హెయిలీ మాథ్యూస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ మైదానాన్ని వీడింది. మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ..'బంతి నా బ్యాట్‌కు చాలా దూరంగా ఉంది. అల్ట్రా ఎడ్జ్‌లో వచ్చిన శబ్దం బంతిది కాదు, బహుశా నా బ్యాట్ హ్యాండిల్ ప్యాడ్‌కు తగలడం వల్ల వచ్చి ఉండవచ్చు. టీవీ స్క్రీన్‌పై స్పష్టమైన గ్యాప్ కనిపిస్తున్నా,టెక్నాలజీ ఆధారంగా అంపైర్ ఆ నిర్ణయం తీసుకున్నారు. దాన్ని గౌరవించక తప్పదు' అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్.. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' డాని వ్యాట్-హాడ్జ్ (42 బంతుల్లో 65 పరుగులు) మెరుపు ఇన్నింగ్స్‌తో 186 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం విండీస్‌ను 148 పరుగులకే కట్టడి చేసి సెమీస్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

## కన్నీళ్లు పెట్టుకున్న బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్!

ఫుట్‌బాల్ ప్రియులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న క్షణం రానే వచ్చింది. బ్రెజిల్ ఫుట్‌బాల్ స్టార్, మాజీ కెప్టెన్ నెయ్‌మార్ దాదాపు మూడేళ్ల (981 రోజులు) సుదీర్ఘ విరామం తర్వాత తిరిగి జాతీయ జట్టు జెర్సీని ధరించాడు. ఫిఫా ప్రపంచకప్ 2026 గ్రూప్-సి లో భాగంగా స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మైదానంలోకి అడుగుపెట్టాడు. ఈ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 3-0 తేడాతో బ్రెజిల్ ఘనవిజయం సాధించగా.. జట్టు విజయం కంటే నెయ్‌మార్ పునరాగమనమే అభిమానుల్లో ఎక్కువ ఉత్సాహాన్ని నింపింది. 2023 అక్టోబర్‌లో ఉరుగ్వేతో జరిగిన మ్యాచ్‌లో నెయ్‌మార్ మోకాలికి తీవ్ర గాయమైంది. ఆ తర్వాత సర్జరీ జరగడంతో సుదీర్ఘ విశ్రాంతి తీసుకున్నాడు.



34 ఏళ్ల వయసులో ఈ తరహా గాయం నుంచి కోలుకుని పునరాగమనం చేయడం అంత సులువు కాదు. కానీ, పట్టుదలతో శ్రమించిన నెయ్‌మార్.. మియామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 76వ నిమిషంలో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి ప్రవేశించాడు. అతడు వార్మప్ చేస్తున్న సమయం నుంచే స్టేడియంలోని అభిమానులు కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. ఇక మ్యాచ్ అనంతరం నెయ్‌మార్ మాట్లాడుతూ... 'మూడేళ్ల తర్వాత మళ్లీ జాతీయ జెర్సీని ధరించడం మాటల్లో చెప్పలేనంత ఆనందాన్ని ఇస్తోంది. శారీరకంగా నేను బాగున్నాను. ఇన్నాళ్లూ ఆటకు దూరం కావడం మానసికంగా నన్ను కలచివేసింది' అంటూ భావోద్వేగానికి గురయ్యాడు. బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోట్టి వ్యూహం ప్రకారమే నెయ్‌మార్ రెండో అర్ధభాగంలో బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ స్టార్ వినిసియస్ జూనియర్ రెండు అద్భుత గోల్స్‌తో మెరిశాడు. 'మా ఆరాధ్య ఆటగాడు జట్టులోకి రావడం మాకందరికీ కొండంత బలాన్నిచ్చింది. అతడు మరింత రాణించి ఈ టోర్నీలో మాకు అండగా నిలుస్తాడని ఆశిస్తున్నాను' అని వినిసియస్ పేర్కొన్నాడు. నెయ్‌మార్ రాకతో బ్రెజిల్ శిబిరంలో సరికొత్త జోష్ నెలకొంది.

## శుభ్‌మన్ గిల్ కు జాక్ పాట్: చరిత్ర తిరగరాసిన కివీస్ బౌలర్

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా వన్డే, టెస్ట్ ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో భారత జట్టు ప్లేయర్లు సత్తా చాటారు. ఓపెనర్ శుభ్‌మన్ గిల్ వన్డే బ్యాటింగ్ కేటగరిలో తడాఖా చూపాడు. ఏకంగా రెండో స్థానానికి దూసుకెళ్లాడు. టెస్ట్ బౌలింగ్ విభాగంలో స్టార్ పేసర్ జస్ ప్రీత్ బుమ్రాతో టాప్ కు చేరుకున్నాడు. న్యూజిలాండ్ బౌలర్ మ్యాట్ హెన్రీతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానాన్ని పంచుకున్నాడు. ఇంగ్లాండ్ దిగ్గజ బ్యాటర్ జో రూట్ తిరిగి టెస్ట్ క్రికెట్‌లో నంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఇటీవలి కాలంలో వన్డేల్లో నిలకడగా అద్భుత ప్రదర్శన చేస్తున్న శుభ్‌మన్ గిల్ మూడు స్థానాలు ఎగబాకి తాజా ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరుకున్నాడు. ప్రస్తుతం అగ్రస్థానంలో కొనసాగుతున్న న్యూజిలాండ్ స్టార్ డారిల్ మిచెల్ కంటే గిల్ కేవలం 24 రేటింగ్ పాయింట్లు మాత్రమే వెనుక ఉన్నాడు. డారిల్ మిచెల్ 791 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. గిల్ పాయింట్లు 768. వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ ఏకంగా 21 స్థానాలు మెరుగుపరుచుకుని 43వ స్థానానికి చేరుకున్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన వన్డే సిరీస్ జట్టు ప్లేయర్లకు బూస్ట్ ఇచ్చింది. దీని తర్వాతే వారందరి ర్యాంకింగ్స్ అన్నీ కూడా మెరుగుపడ్డాయి. టీమిండియా బౌలర్లు కూడా ర్యాంకింగ్స్‌లో తమ స్థానాలను మెరుగుపర్చుకున్నారు. లెఫ్ట్ ఆర్మ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ 16 స్థానాలు ఎగబాకి 22వ స్థానానికి చేరుకోగా, ప్రసిద్ధ్ కృష్ణ 34 స్థానాలు దూసుకెళ్లి, 58వ ర్యాంకును సొంతం చేసుకున్నాడు. ఆల్ రౌండర్ వాషింగ్టన్ సుందర్ 17 స్థానాలు మెరుగుపరుచుకుని 71వ స్థానంలో నిలిచాడు. టెస్ట్ బౌలింగ్ విభాగంలో న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ మ్యాట్ హెన్రీ సంచలనం సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన టెస్టులో 11 వికెట్లతో చెలరేగిన హెన్రీ.. ఐసీసీ టెస్ట్ బౌలర్ల జాబితాలో బుమ్రాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానానికి చేరుకున్నాడు. హెన్రీ తన అత్యుత్తమ బౌలింగ్‌తో 870 పాయింట్లతో ఈ స్థానాన్ని పంచుకున్నాడు. కివీస్ చరిత్రలో సర్ రిచర్డ్ హాడ్లీ, జాక్ కోవీల తర్వాత ఈ మైలురాయిని అందుకున్న మూడో బౌలర్‌గా హెన్రీ నిలిచాడు. 36 సంవత్సరాల తర్వాత ఓ న్యూజిలాండ్ బౌలర్ టెస్ట్ ర్యాంకింగ్స్ లో అగ్రస్థానానికి చేరుకోవడం ఇదే తొలిసారి. జాక్ కోవీ 1947లో టాపర్ గా నిలిచాడు. రిచర్డ్ హ్యాడ్లీ 1984 నుంచి 1990 వరకు కొనసాగాడు. టెస్ట్ బ్యాటింగ్ విభాగంలో ఇంగ్లాండ్ వెటరన్ జో రూట్ మళ్లీ అగ్రస్థానాన్ని చేరుకున్నాడు. కివీస్‌తో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లలో 46, 77 పరుగులతో రాణించిన రూట్.. తన సహచరుడు హ్యారీ బ్రూక్, ఆస్ట్రేలియా విధ్వంసకర బ్యాటర్ ట్రావిస్ హెడ్‌లను వెనక్కి నెట్టి కెరీర్‌లో 12వ సారి నంబర్ వన్ పీఠాన్ని అధిరోహించాడు. అదే సమయంలో కివీస్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర రెండంచెలు ఎగబాకి 10వ స్థానానికి, డారిల్ మిచెల్ ఐదు స్థానాలు ఎగబాకి 16వ స్థానానికి చేరుకుని సత్తా చాటారు. వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్ లో.. డారిల్ మిచెల్- 815, గిల్- 791, విరాట్ కోహ్లీ- 768, రోహిత్ శర్మ- 754, ఇబ్రహీం జద్రాన్- 712, బాబర్ ఆజమ్- 689, షై హోప్- 683, హ్యారీ టెక్టార్- 679, చరిత్ శ్రీలంక- 659, హ్యారీ బ్రూక్- 656 పాయింట్లతో టాప్ 10లో ఉన్నారు.





## పెళ్లి పేరుతో మోసం.. స్టార్ క్రికెటర్‌పై సంచలన ఆరోపణలు!

ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ప్లేయర్ అభిషేక్ పోరెల్‌పై ఓ యువతి సంచలన ఆరోపణలు చేసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి, మూడేళ్లుగా శారీరక సంబంధం పెట్టుకుని.. ఆపై మోసం చేశాడంటూ సదరు యువతి ఆరోపించింది. అంతేకాక తాను మోసపోయానంటూ పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. పశ్చిమ బెంగాల్లోని హుగ్లీ జిల్లా మొగ్రా పోలీస్ స్టేషన్లో ఆ యువతి తన తల్లితో కలిసి వెళ్లి ఆ క్రికెటర్‌పై ఫిర్యాదు చేశారు. పెళ్లి పేరుతో మోసం చేయడమే కాకుండా.. తనపై దాడికి పాల్పడ్డాడని సదరు మహిళ తన ఫిర్యాదులో పేర్కొంది. యువతి ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. ఆ మహిళ అభిషేక్ పోరెల్‌తో గత మూడేళ్లుగా సహజీవనం చేస్తోంది. కొన్నాళ్లు వీరి బంధం బాగానే సాగినప్పటికీ.. 2025లో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఆ తర్వాత అభిషేక్ ఆమెకు క్రమక్రమంగా దూరమయ్యాడు.



అలానే పెళ్లికి నిరాకరించడంతో ఈ వ్యవహారం కాస్తా పోలీస్ స్టేషన్ చేరింది. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. తనపై వచ్చిన ఆరోపణలను 23 ఏళ్ల అభిషేక్ పోరెల్ తీవ్రంగా ఖండించాడు. తాను క్రికెట్లో రాణిస్తూ మంచి ఫామ్‌లో ఉన్నందుకే కొందరు కావాలనే తన పేరును వివాదాల్లోకి లాగుతున్నారని అన్నాడు.

## కోహ్లీ, ధోనీ, రోహిత్‌లను తన పెళ్లికి పిలవని టీమిండియా క్రికెటర్



టీమిండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కొత్త జీవితంలోకి అడుగుపెట్టాడు. తన స్నేహితురాలు అక్షితా రాజ్‌ను అతడు వివాహమాడాడు. ఆధ్యాత్మిక నగరం వారణాసి (బనారస్) వేదికగా వీరి వివాహ వేడుక అత్యంత ఘనంగా జరిగింది. బుధవారం ఆకాశ్ దీప్ తన పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకోవడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ వివాహ వేడుకకు సంబంధించిన ఒక వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ వైరల్ అవుతోంది. అందులో ఒక అతిథి సరదాగా.. 'భయ్యా.. నీ పెళ్లికి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, ఎం.ఎస్ ధోనీలను ఆహ్వానించలేదేంటి?' అని ప్రశ్నించాడు. దానికి ఆకాశ్ దీప్ తెలివైన సమాధానం ఇస్తూ నవ్వులు పూయించాడు. 'ఒకవేళ వారే కనుక ఇక్కడికి వస్తే.. ఇక ఈ బనారస్‌లో నా పెళ్లి సజావుగా సాగుతుందా చెప్పండి?' అని బదులిచ్చాడు. ఈ టీమిండియా దిగ్గజ ఆటగాళ్లు వస్తే అభిమానుల తాకిడి ఏ రేంజ్‌లో ఉంటుందో, ఆ అభిమానులను తట్టుకుని పెళ్లి జరిపించడం ఎంత కష్టమో ఆకాశ్ దీప్ ఇచ్చిన కౌంటర్ అందరినీ ఆకట్టుకుంది. ఆకాశ్ క్రికెట్ విషయానికి వస్తే.. గతేడాది ఇంగ్లండ్‌తో బర్మింగ్‌హామ్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక 'ఆండర్సన్-టెండూల్కర్' సిరీస్‌లో ఒకే మ్యాచ్‌లో 12 వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించాడు.

## డ్రెస్సింగ్ రూమ్‌లోకి నో ఎంట్రీ వైభవ్‌కు ప్రత్యేక గది




న్యూఢిల్లీ: 15 ఏళ్ల టీనేజర్ వైభవ్ సూర్యవంశీని బీసీసీఐ ఇంగ్లండ్ టూర్‌కు ఎంపిక చేసింది. అయితే, భారత జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో అతడు ఉండేందుకు అవకాశం లేదని సమాచారం. ఇంగ్లండ్ బోర్డు, ఐసీసీ నిబంధనల ప్రకారం 16 ఏళ్లలోపు వయసున్న ఆటగాళ్లు విడిగా వేరే గదిలో ఉండాల్సి ఉం టుంది. మ్యాచ్ సమయంలో, టీమ్ సమావేశాలకు మాత్ర మే ఇలాంటి ప్లేయర్లకు డ్రెస్సింగ్ రూమ్‌లోకి అనుమతి ఉంటుందని బోర్డు వర్గాలు తెలిపాయి. వైభవ్‌తోపాటు అతడి తల్లిదండ్రులను కూడా బీసీసీఐ అనుమతించింది. దీంతో వారు వేరే గదిలో అతడికి తోడుగా ఉండనున్నారు. వైభవ్ సూర్యవంశీపై దిగ్గజ ఆటగాడు కపిల్‌దేవ్ ప్రశంసల జల్లు కురిపించాడు. అతడు అపార ప్రతిభావంతుడని కొనియాడాడు. వైభవ్ బ్యాటింగ్ సచిన్ టెండూల్కర్‌ను తలపిస్తోందన్నాడు. 'వైభవ్ ఇంకా చిన్నోడే. 20-22 సంవత్సరాలకు చేరుకున్నాక మనం అతడి గురించి అంచనా వేయొచ్చు. 16 ఏళ్ల వయస్సులో సచిన్ ఎలా ఆడేవాడో వైభవ్ కూడా అలానే బ్యాటింగ్ చేస్తున్నాడు. కానీ సచిన్‌లా సుదీర్ఘకాలం ఆడగలడా? వైభవ్ ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది' అని కపిల్ చెప్పుకొచ్చాడు.

## పాకిస్థాన్ మహిళల జట్టులో గొడవ.. సీనియర్ ప్లేయర్ హోటల్ గదిలో భర్త!

ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో పాకిస్థాన్ టీమ్ పేలవ ప్రదర్శన కనబర్చింది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. ఒకవైపు వరుస పరాజయాలతో పాకిస్థాన్ మహిళల టీమ్ సతమతమవుతుంటే.. మరోవైపు జట్టులో అంతర్గత విభేదాలు, గొడవలు తారస్థాయికి చేరినట్లు వార్తలు వస్తున్నాయి. కెప్టెన్ ఫాతిమా సనా, టీమ్ మెంటార్ వహాబ్ రియాజ్ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఇద్దరి ఆధిపత్య పోరుతో ఆటగాళ్లు నలిగిపోతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధికారికంగా స్పందించకపోయినా, సోషల్ మీడియా, మెయిన్‌స్ట్రీమ్ మీడియాలో వరుస కథనాలు వస్తున్నాయి. బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు ముందు కోచ్, కెప్టెన్ మధ్య విభేదాలు తారా స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. సీనియర్ ప్లేయర్ ఆలియా రియాజ్ భర్త, ఆమెతో పాటే టీమ్ హోటల్ గదిలో ఉండటాన్ని కెప్టెన్ ఫాతిమా సనా తీవ్రంగా వ్యతిరేకించింది. కెప్టెన్ ఫాతిమా సూచనలతో ఆలియా రియాజ్ భర్త అలీ యూనిస్‌ను టీమ్ మేనేజ్‌మెంట్ గది ఖాళీ చేయించింది. అయితే బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్‌కు రాకుండా అలియా రియాజ్ తన భర్తతో కలిసి షికారుకు వెళ్లింది. దాంతో క్రమశిక్షణ ఉల్లంఘన కింద ఆలియాను బంగ్లాదేశ్‌తో మ్యాచ్ నుంచి తప్పించాలని ఫాతిమా పట్టుబట్టింది.

# సినిమా

## 'మా ఇంటి బంగారం' సినిమాకు ఆడియెన్స్‌ను వస్తోన్న రెస్పాన్స్ చూస్తే చాలా హ్యాపీగా ఉంది : సమంత

ట్రాలాలా పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మించిన సినిమా 'మా ఇంటి బంగారం'. సమంత ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రానికి నందినీ రెడ్డి దర్శకత్వం వహించారు. ఈ సినిమా జూన్ 19న వరల్డ్ వైడ్‌గా గ్రాండ్ రిలీజై బ్లాక్ బస్టర్ అయ్యింది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర యూనిట్ థాంక్స్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్, నందినీ రెడ్డి, శ్రీముఖి పాల్గొన్నారు. ఈ సందర్భంగా..



సమంత మాట్లాడుతూ "'మా ఇంటి బంగారం' సినిమాకు వస్తోన్న రెస్పాన్స్ చూసిన తర్వాత చాలా సంతోషంగా అనిపించింది. నాకు సింక్ కాలేదు. దీన్నే ప్రతి ఆర్టిస్ట్ కోరుకుంటారు. ప్రతి సినిమాతో బెటర్ కావాలి. పెర్ఫామెన్స్ బెటర్ కావాలని డ్రీమ్‌లాగా భావిస్తారు. ఈవిషయంలో నేను చాలా లక్కీగా భావిస్తాను. థియేటర్స్‌లో సినిమాను చూస్తుంటే సర్‌ప్రైజింగ్‌గా ఉంది. బస్ ఫైట్, క్లైమాక్స్ అన్నీ ఒకే రోజులో చేశాం. అంత కంట్రోల్డ్‌గా, వేస్టేజ్ లేకుండా చేశాం. ప్రీ రిలీజ్ ముందే రికవరి కావాలని ప్లానింగ్‌తో ముందుకెళ్లాం. తొలి రోజు ఎన్ని టికెట్స్ సేల్ అవుతాయనే దానిపై క్లారిటీ లేదు. మూడు సంవత్సరాల తర్వాత చేసిన సినిమా ఇది. కాబట్టి మా బడ్జెట్‌ను ప్రీ రిలీజ్ సమయంలోనే రికవరీ కావాలని అనుకున్నాం. ఒక స్టార్ హీరోని ఎలా హైప్ చేస్తారో మా టీమ్ నన్నుహైప్ చేశారు. రాజ్ గారు ఈరోల్ రాస్తున్నప్పుడు కమర్షియల్ ఇంపాక్ట్ ఉండేలా రాశారు. ఈరోజు నాగురించి ఇలా మాట్లాడుతున్నారంటే నా క్యారెక్టర్‌ను ఎలా డిజైన్ చేశారనే కారణం. హీరోయిన్‌గా నేను చాలా సినిమాలు, కమర్షియల్ సినిమాలు చేశాను. అయితే ఏదో ఒక స్టేజ్‌లో రిస్క్ అవసరం. లేకపోతే.. ఒకచోటే ఆగిపోతాం. కెరీర్‌లో చాలా అప్ అండ్ డౌన్స్ చూశాను. కొందరైతే సమంత అయిపోయిందని కూడా రాశారు. హీరోయిన్‌గా ఇక కష్టమని కూడా అన్నారు. నేను ఆ సమయంలో ఏమీ బాధపడలేదు. ఆ సమయంలో అది కరెక్టేనేమో అనిపించింది. దాన్ని నేను చాలెంజ్‌గా తీసుకుని వచ్చాను. అలాగే ఈ సినిమాకు కూడా నాతో పాటు ఎంటైర్ టీమ్ చాలెంజింగ్‌గా తీసుకుని వర్క్ చేశాం. సినిమా చూసిన తర్వాత చిరంజీవిగా అప్రిషియేషన్స్ మాకు పెద్ద బూస్ట్ ఇచ్చింది. మాతో ఆయన గంటపాటు గడిపారు. ఆయనకు థాంక్స్. కెరీర్ అనేది మన చేతిలో ఉంటుంది. కానీ రిలేషన్ అనేది ఇద్దరి వ్యక్తుల చేతిలో ఉంటుంది. ఏదైనా చక్కగా ముందుకు వెళ్లాలంటే అమ్మాయి తనపై తాను నమ్మకంతో ఉండాలి. ఒకే వ్యక్తిపై ఎక్కువగా ఆధారపడకూడదని ఇప్పటి అమ్మాయిలకు చెబుతాను. సినిమాను ఇంత భారీ సక్సెస్ చేసిన ఆడియెన్స్‌కు మనస్ఫూర్తిగా థాంక్స్ చెబుతున్నాను" అన్నారు.

డైరెక్టర్ నందినీ రెడ్డి మాట్లాడుతూ "రాజ్ గారు కథను డిజైన్ చేసినప్పుడే అన్నీ వర్గాల ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా ఎలిమెంట్స్ ఉండాలనే ఆలోచనతో చేశారు. సమంతగారిని సెంటరాఫ్ ఎట్రాక్షన్‌గా పెట్టుకుని డిజైన్ చేశారు. సమంత ఎప్పటికీ స్పెషల్.. రాజ్‌గారు యాడ్ కావటం ఇంకా బలమైంది. ఓ బేబి సినిమా తర్వాత సమంతగారితో నేను చేసిన సినిమా. ఆమెలో కొత్త డైమన్షన్‌ను ఇందులో చూస్తారు. ఇంతకు ముందు మీరనుకుంటున్న సామ్ కంటే పది రెట్లు ఎక్కువగా చూస్తారని ముందుగానే చెప్పాను. అదే నిజమైంది. ఆడియెన్స్‌కి థాంక్స్" అన్నారు.

నిర్మాత రాజ్ నిడిమోరు మాట్లాడుతూ "మేం హిందీలో ఫ్యామిలీ మ్యాన్, స్త్రీ వంటి సబ్జెక్ట్స్‌ను ప్రేక్షకులకు అందించాం. అయితే మా ఇంటి బంగారం సినిమాకు వచ్చినంత రెస్పాన్స్ ఎక్కడా రాలేదు. మా వాళ్లంతా ఇప్పుడు నిద్ర లేచి.. ఎంత బాగా తీశావురా! అన్నారు. ఈ సినిమా ప్రతి ఇంటి వరకు వెళుతుంది. నాకు ఎప్పుడూ కొత్త సినిమాలు చేయాలన్నా.. రిస్క్ తీసుకోవాల్సి వచ్చింది. మేమే ప్రొడ్యూస్ చేయాల్సి వచ్చింది. ఇక్కడ కూడా అదే ప్రాబ్లమ్ ఫేస్ చేశాం. హిమాంక్ ఒక్కడే నిలబడ్డాడు. అయితే ఒక పక్కన భయంగానే ఉండింది. ఈ సినిమాను డిజైన్ చేసిప్పుడు కూడా సమంత స్కిల్స్ కూడా బయటకు రావాలని అనుకున్నాను. ముందు సినిమా చేయటానికి సమంత ఒప్పుకోలేదు. కానీ ఈ సినిమా చేయమని సామ్‌ను అడిగాను. ఈ కథను చెప్పగానే తను ఓకే చెప్పింది. టీమ్ వర్క్ లాగా పని చేశాం. చాలా డెలికెట్‌గా ప్లాన్ చేసి డిజైన్ చేశాం. దానికి నందినీ బాగా సపోర్ట్ చేసింది. సమంత కూడా ఆ విషయంలో కాన్ఫిడెంట్‌గా ఉండింది. టీమ్‌లో ప్రతీ ఒక్కరూ కావాల్సిదానికంటే ఎక్కువగానే సపోర్ట్ చేశారు. అందరికీ థాంక్స్" అన్నారు.

## పెద్ది తరవాత బుచ్చిబాబులో మార్పు

### కొత్త సినిమా కోసం వేగం పెంచాలని నిర్ణయం




టాలీవుడ్‌లో దర్శకుడు బుచ్చిబాబు సాన గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకొచ్చేది ఆయన కథలపై చూపించే నిబద్ధత. ఒక సినిమా పూర్తయిన వెంటనే మరో ప్రాజెక్ట్‌ను ప్రారంభించే దర్శకుల కంటే, కథను పూర్తిగా సిద్ధం చేసి, ప్రతి అంశాన్ని పక్కాగా మలిచిన తర్వాతే సెట్స్‌పైకి తీసుకెళ్లే దర్శకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఇప్పుడు బుచ్చిబాబు తన పని విధానంలో కీలకమైన మార్పుకు సిద్ధమవుతున్నారనే చర్చ ఇండస్ట్రీలో జోరుగా సాగుతోంది. 'ఉప్పెన' సినిమాతో దర్శకుడిగా అద్భుతమైన అరంగేట్రం చేసిన బుచ్చిబాబు తొలి సినిమాతోనే భారీ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ సినిమా తర్వాత వెంటనే కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించకుండా, తన రెండో చిత్రానికి అవసరమైన కథ, పాత్రలు, ప్రీ-ప్రొడక్షన్ పనులపై చాలా సమయం కేటాయించారు. దీంతో 'ఉప్పెన' తర్వాత ఆయన తదుపరి చిత్రం కోసం అభిమానులు, సినీ పరిశ్రమ దాదాపు కొన్ని సంవత్సరాలు ఎదురుచూడాల్సి వచ్చింది. చివరకు రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని అందుకుంది. 'పెద్ది' విజయం బుచ్చిబాబు కెరీర్‌లో మరో కీలక మైలురాయిగా నిలిచింది. గ్రామీణ నేపథ్యం, భావోద్వేగాలతో కూడిన కథనం, పాత్రల రూపకల్పన, విజువల్ ట్రీట్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా ఆయన కథ చెప్పే తీరు, భావోద్వేగాలను తెరపై ఆవిష్కరించే విధానానికి విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభించాయి. గతంతో పోలిస్తే చాలా తక్కువ సమయంలోనే తన తదుపరి సినిమాను ప్రకటించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం టాలీవుడ్‌లో పోటీ తీవ్రంగా పెరిగింది. ఒక దర్శకుడు వరుస విజయాలను కొనసాగించాలంటే తక్కువ వ్యవధిలోనే కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటించడం కూడా కీలకంగా మారింది. ఈ విషయాన్ని బుచ్చిబాబు కూడా గుర్తించినట్లు కనిపిస్తోంది. అందుకే ఈసారి కథా రచన, ప్రీ-ప్రొడక్షన్ పక్రియలను వేగంగా పూర్తి చేసి తదుపరి సినిమాను త్వరగా పట్టాలెక్కించాలని ఆయన భావిస్తున్నారని సమాచారం.

## వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ



ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది.

## నేను రెడీ'- మూవీ పోస్టర్‌లో స్టైలిష్ లుక్ లో హవిష్



కమర్షియల్ హిట్స్ అందించిన దర్శకుడు త్రినాధ రావు నక్కిన దర్శకత్వంలో, యంగ్ హీరో హవిష్ భారీ ఎంటర్‌టైనర్ 'నేను రెడీ' కోసం సిద్ధమవుతున్నారు. హర్నిక్స్ ఇండియా ఒఒఖ బ్యానర్‌పై కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో హవిష్ సరసన కావ్య థాపర్ నటిస్తోంది. కామెడీ, వినోదం, మాస్ అంశాల కలయికతో ఈ సినిమా రూపొందుతోంది.

హవిష్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ చిత్ర బృందం ఒక కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హవిష్ స్టైలిష్ లుక్‌లో ఆకట్టుకున్నారు. ఒక వేర్‌హౌస్ సెట్టింగ్‌లో కూర్చుని ఉన్న హవిష్ తన ప్రజెన్స్ కట్టిపడేశాడు. అతని ట్రెండీ లుక్ అతని పాత్రపై ఆసక్తిని పెంచుతున్నాయి. అద్భుతమైన స్క్రీన్ ప్రెజెన్స్, గ్లామరస్ నటనతో బాలీవుడ్‌లో సంచలనం సృష్టించిన నర్గీస్ ఫక్రి ఈ చిత్రంలోని ఒక ప్రత్యేక పాటతో తెలుగు తెరకు పరిచయం కానుంది.

ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, శ్రీలక్ష్మి, విటివి గణేష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇదివరకే విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

'నేను రెడీ' చిత్రం అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణులతో రూపొందుతోంది. మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తుండగా, నిజార్ షఫీ సినిమాటోగ్రఫీని, ప్రవీణ్ పూడి ఎడిటింగ్‌ను నిర్వహిస్తున్నారు. విక్రాంత్ శ్రీనివాస్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే అందించారు.

మేకర్స్ త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటించనుంది.

నటీనటులు: హవిష్, కావ్య థాపర్, నర్గీస్ ఫక్రి (స్పెషల్ సాంగ్), బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, విటివి గణేష్, గోపరాజు రమణ, హరితేజ, మహతి, రూప లక్ష్మి, జయవాణి, మాణిక్ రెడ్డి, బలగం సత్యనారాయణ, రోహన్ రాయ్

## బాహుబలి: ది ఎటర్నల్ వార్

### కీలక అప్‌డేట్‌ను అందించిన ప్రభాస్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులకు మరో సర్‌ప్రైజ్ అందించారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'బాహుబలి' ఫ్రాంచైజీ నుంచి వస్తున్న కొత్త యానిమేషన్ ప్రాజెక్ట్ 'బాహుబలి: ది ఎటర్నల్ వార్'కు సంబంధించిన కీలక అప్‌డేట్‌ను ప్రభాస్ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేస్తూ అభిమానుల్లో భారీ ఆసక్తిని పెంచారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. యానిమేషన్ రూపంలో ప్రభాస్ యోధుడి అవతారంలో కనిపించడం అభిమానులకు గూస్‌బంప్స్ కలిగిస్తోంది.




'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్న ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ప్రపంచంలోని అత్యంత ప్రతిష్టాత్మక యానిమేషన్ ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఫ్రాన్స్‌లోని 'అన్నెసీ ఇంటర్నేషనల్ యానిమేషన్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026'లో 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' ఎంపిక కావడం భారతీయ సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. ఈ ఫెస్టివల్‌లో నిర్వహించే 'వర్క్ ఇన్ ప్రోగ్రెస్' సెషన్‌లో ఈ ప్రాజెక్ట్‌ను ప్రదర్శించనున్నారు. ప్రపంచ వ్యాప్తంగా యానిమేషన్ రంగానికి చెందిన ప్రముఖులు, స్టూడియోలు, నిర్మాతలు, దర్శకుల సమక్షంలో ఈ ప్రాజెక్ట్ ప్రదర్శించబడనుండటం విశేషం. ప్రభాస్ ఈ విషయాన్ని సోషల్ మీడియాలో పంచుకుంటూ తన ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఆయన చేసిన పోస్ట్ కొద్ది నిమిషాల్లోనే లక్షలాది లైక్స్, వేలాది కామెంట్లను సొంతం చేసుకుంది. ఈ యానిమేషన్ చిత్రాన్ని ఆర్కా మీడియా వర్క్స్ నిర్మిస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి ఈ ప్రాజెక్ట్‌కు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. ప్రముఖ యానిమేషన్ దర్శకుడు ఇషాన్ శుక్లా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రభాస్ తన పోస్ట్‌లో .. బాహుబలి: ది ఎటర్నల్ వార్ ప్రాజెక్ట్ అన్నెసీ యానిమేషన్ ఫెస్టివల్‌కు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. మా టీమ్ నిజంగా అద్భుతమైన పనిని చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రపంచం ఎప్పుడెప్పుడు చూస్తుందా అని నేను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని పేర్కొన్నారు.

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com